# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 224 | విశాఖపట్నం | 15-5-2026 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 224 | VISAKHAPATNAM | 15-5-2026 FRIDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram










5లో

## మధురవాడలో మౌలిక వసతులపై జీవీఎంసీ దృష్టి



5లో

## అధ్వాన్నంగా రహదారులు.. పట్టించుకోని అధికారులు..



6లో

## మైగ్రేయిన్ మిమ్మలను వేధిస్తోందా?

# పొదుపు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిద్దాం: చంద్రబాబు

**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించిన పొదుపు చర్యలపై ప్రత్యేకంగా కేబినెట్‌లో చర్చించారు. ఏపీలో ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోంపై చర్చించినట్లు సమాచారం. సూర్యఘర్, పీఎం కుసుంను సీరియస్‌గా తీసుకోవాలని సీఎం ఆదేశించారు. దేశాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కాన్వాయ్‌ల తగ్గింపుతో సరిపోదని.. మరిన్ని పొదుపు చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రజలకు ముందుగా అవగాహన కల్పిద్దామని తెలిపారు. వారానికి ఒక రోజు నో వెహికల్ డే పాటిద్దామని పిలుపునిచ్చారు. కొన్ని రోజులు మంత్రుల విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాడాలని సూచించారు. అవసరమైతే సెక్రటేరియట్‌కి సైకిల్ మీద రావాలని మార్గనిర్దేశం చేశారు. సంక్షోభ నిర్వహణ అందరికీ రావాలని సూచించారు. సంక్షోభాన్ని మేనేజ్ చేయడం అందరు తెలుసుకోవాలని సూచించారు. ఈ విషయంలో మంత్రులు, అధికారులకు బాధ్యత ఉంటుందని తెలిపారు. దేశాన్ని మనం కాపాడుకోవాలని చెప్పారు. అందరం



కాన్వాయ్‌లు తగ్గించుకుంటే సరిపోదని అన్నారు. ఇంకా ఇతర పొదుపు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాడే వాహనాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకోవాలని మార్గనిర్దేశం చేశారు. మంత్రులు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు లేదా.. ఈవీ, సైకిల్ వినియోగించాలని నిర్ణయించారు. జిల్లాల పర్యటనల్లోనూ కాస్ట్ కటింగ్ పాటించాలని నిర్ణయం తీసుకున్నారు. అధిక సంఖ్యలో సమావేశాలు వర్చువల్‌గా నిర్వహించాలని తెలిపారు. ప్రెజెన్స్ అవసరం లేని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఖర్చులు తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారు. పొదుపు చర్యలని మనం ఒకేసారి ప్రజలకు చెబితే ఇబ్బంది పడతారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. నిదానంగా వెళ్దామని పవన్ కల్యాణ్ సూచించారు. రెండు రోజుల పాటు మనం ప్రజలకు అన్ని పొదుపు చర్యలు వివరిద్దామని సీఎం అన్నారు. అలానే చేద్దామని మిగతా మంత్రులు చెప్పారు. వర్క్ ఫ్రం హోం, కార్ పూలింగ్ పాటించాలని సీఎం సూచించారు. ఆయా శాఖల్లో చేపట్టాల్సిన (తరువాయి 2వ పేజీలో)

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, 16 మందికి గాయాలు

**ఏలూరు జిల్లా, పతాకం న్యూస్:** జాతీయ రహదారి-16పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఏలూరు జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సును టిప్పర్ లారీ బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శ్రీకాకుళం జిల్లా పొందూరు నుంచి గుంటూరుకు వెళ్తున్న శ్రీ వెంకటరమణ ట్రావెల్స్ బస్సును, నల్లజర్లలో మెటల్ అన్‌లోడ్ చేసి దేవరపల్లి వైపు వస్తున్న టిప్పర్ లారీ ఢీకొంది. తెల్లవారుజామున సుమారు 3:30 గంటల సమయంలో టిప్పర్ లారీ డ్రైవర్ నిద్రమత్తులో వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో లారీ డివైడర్‌ను దాటి అవతలి రోడ్డులోకి దూసుకెళ్లి, ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. (తరువాయి 2వ పేజీలో)



## ఏపీ పీజీఈసెట్-2026 ఫలితాలు విడుదల



**అమరావతి, పతాకం న్యూస్:** ఉన్నత విద్యా ప్రవేశాలకు నిర్వహించే ఏపీ పీజీఈసెట్ -2026 ఫలితాలు విడుదలయ్యాయి. గురువారం మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా ఫలితాలను విడుదల చేశారు.

## బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు.. 8 మంది మృతి



**మధ్యప్రదేశ్, పతాకం న్యూస్:** మధ్యప్రదేశ్ దేవాస్ జిల్లాలో ఘోర విషాదం జరిగింది. జిల్లాలో టోంక్ కాలాన్ ప్రాంతంలో బాణాసంచా తయారీ కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై సమాచారం అందగానే జిల్లా ఉన్నతాధికారులతోపాటు పోలీసులు బాణాంసంచా తయారీ కర్మాగారం వద్దకు చేరుకున్నారు. స్థానికుల సహాయంలో క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

## బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరైన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశ రాజధానిలో జరుగుతున్న బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. బ్రిక్స్ సభ్య దేశాల విదేశాంగ మంత్రులు, పరిశీలక దేశాల ప్రతినిధులను ప్రధాని మోదీ కలిశారు. ఈ సందర్భంగా వారిని ఆప్యాయంగా పలకరించారు.









## సచివాలయాల పేరు మార్పు ఏదీ?

3లో



## కేరళ ముఖ్యమంత్రిగా సతీశన్.. 11 రోజుల తర్వాత వీడిన సస్పెన్స్

2లో

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## చెలగాటం..

వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కుంభకోణాలకు ఆలవాలంగా మారడం గర్హనీయం. ఈ నెల 3న జరిగిన నీట్ యుజి 2026 పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని తేలడంతో పరీక్షను రద్దు చేసి, సిబిఐ విచారణకు జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్ టిఎ) ఆదేశించింది. పేపర్ లీక్, పరీక్ష రద్దుతో 22 లక్షల మంది విద్యార్థులు అనవసరమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షలకు 42 గంటల ముందే రాజస్థాన్‌లోని సీకర్‌లో వాట్సాప్ లో అందుబాటు లోకి వచ్చిన 'అంచనా పేపర్- లో కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో 120 నుంచి 140 ప్రశ్నలు నీట్ పరీక్షలో వచ్చాయంటే పరీక్ష నిర్వహణలో డొల్లతనం వెల్లడవుతుంది. ఈ పేపర్‌లోని ప్రశ్నలు ప్రిపేరైన విద్యార్థులు 720 మార్కుల్లో 600 వరకు స్కోర్ చేసి ఉండవచ్చన్నది నిపుణుల మాట. ఈ నెల 1 నుండి అంచనా పేపర్ అభ్యర్థులకు చేరిందని, రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకూ విక్రయించారని అధి కారులు గుర్తించి, పలువురు నిందితులను అరెస్టు చేశారు. దేశంలో వైద్య విద్య పట్టణ ప్రాంతాల్లోని ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారికే అందు బాటులో ఉంది. సామాన్యులు వైద్య విద్య చదివించడం దాదాపు అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రతి రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకునేది. 2017లో మోడీ ప్రభుత్వం కేంద్రీకరణ విధానాల్లో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టిఎ) తీసుకొచ్చి, రాష్ట్రాల పరిధిలో ఉన్న వైద్య విద్య ప్రవేశార్హత నీట్ లో భాగం చేశారు. అన్ని పరీక్షలను తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలన్న మోడీ ప్రభుత్వ విధానంతో లీక్ లు, అవకతవకలు షరా మామూలుగా మారిపోయాయి. నీట్ విధానం అన్యాయమని, ఈ విధానాన్ని రద్దు చేసి, వికేంద్రీకరించాలని దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. మోడీ అడుగులకు మడుగు లొత్తుతున్న రాష్ట్రంలోని గత, ప్రస్తుత ప్రభుత్వాలు మిన్నకున్నాయి. దాదాపు 400 మందితో ఏర్పడిన ఎన్ టిఎ నీట్ సహా 46 పరీక్షలను సమన్వయం చేయాల్సి ఉండటం, అందులోనూ ఆర్ఎస్ఎస్, కమలం పార్టీ కుదురు నుంచి వచ్చిన అనర్హులు, అక్రమార్కులు భాగస్వాములు కావడం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది. నాలుగు సార్లు నీట్, ఒకసారి యుజిసి నెట్ లీక్ కావడమే ఇందుకు నిదర్శనం. 2024లో నీట్ యుజి పరీక్ష అవకతవకలపై బీహార్‌లో అరెస్టులు, సకాలంలో పేపర్ ఇవ్వకపోవడం వల్ల గ్రేస్ మార్క్ లు ఇవ్వాల్సి రావడం సహా ఎన్నో అంశాలు చర్చనీయాంశమయ్యాయి. పూర్తి భద్రతా ప్రోటోకాల్ పాటించామని, జిపిఎస్ ట్రాక్ చేసిన వాహనాలు, ఎ.ఐ నియంత్రిత సిసి టివి, బయోమెట్రిక్, 5 జి జామర్లు వంటి చర్యలు తీసుకున్నామని ఎన్ టిఎ చెబుతున్నా అక్రమాలు జరుగుతున్నాయంటేనే... పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో వైఫల్యం కనిపిస్తోంది. విద్యార్థుల కలలను భగ్నం చేసే పేపర్ లీక్ లను అడ్డుకోకపోగా, కనీసం నోరుమెదపని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండటం సిగ్గుచేటు. పరీక్షా పే చర్చ అంటూ విద్యార్థులతో చర్చించే ప్రధానికి ఏటా జరుగుతున్న పేపర్ లీక్ లపై నోరుపెగలడం లేదు. ఏళ్ల తరబడి అవిశ్రాంతంగా శ్రమించి సిద్ధమవుతున్న విద్యార్థులు మరోసారి మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులపై ఆర్థిక భారం, అనిశ్చితితో శిక్ష అనుభవిస్తున్నారు. వ్యవస్థ ఇన్ని లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుంటే మోడీ కా గ్యారెంటీ ఏమైందనే ప్రశ్న ముందుకు వస్తోంది. పేపర్ లీక్ పై కేంద్రప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి. బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి. విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలి.

## పొదుపు పాఠాలు చెప్పే మోడీ ప్రకటనల ఖర్చే 5,987 కోట్లు: ఖర్గే



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** సామాన్యులకు పొదుపు పాఠాలు చెప్పే ప్రధాని మోదీ... తన సొంత డబ్బా కోసం మాత్రం ప్రజాధనాన్ని నీళ్లలా ఖర్చు చేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ధ్వజమెత్తారు. మోదీ పొదుపు సూత్రాలపై ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించారు. మోదీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పట్ల అత్యంత క్రూరంగా వ్యవహరి స్తోందని ఖర్గే మండిపడ్డారు. గత 12 ఏళ్లుగా పింఛన్లను ఒక్క పైసా కూడా పెంచకుండా వారిని వంచిస్తోందని అన్నారు. దేశంలో పెరిగిన ధరల దృష్ట్యా ప్రజల కొనుగోలు శక్తి గణనీయంగా పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర పింఛను సొమ్ముతో కనీసం మందులు, ఆహారం కూడా కొనుక్కోలేని స్థితిలో వృద్ధులు ఉన్నారని అన్నారు. ద్రవ్యోల్బణం కారణంగా కొనుగోలు శక్తి 45% క్షీణించిన తర్వాత... రూ.200 పింఛను విలువ దాదాపు రూ.110తో, రూ.300 పింఛను రూ.165తో, రూ.500 పింఛను రూ.275తో సమానమని వివరించారు. పేదల పింఛన్లు పెంచడానికి మనసు రాని ఈ బుద్ధిలేని ప్రభుత్వం.. ప్రచారానికి మాత్రం కోట్లు ఖర్చు చేస్తోందని మండిపడ్డారు. 2014-15, 2024-25 మధ్య బీజేపీ ప్రభుత్వం కేవలం ప్రకటనల కోసమే ఏకంగా రూ.5,987.46 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. "కోట్లాది మంది వృద్ధులు చాలీచాలని పింఛనుతో ఆకలితో, అనారోగ్యంతో అలమటిస్తుంటే.. మోదీ ప్రభుత్వం మాత్రం ఆర్భాటపు ఎన్నికల ప్రచారాలు, భారీ కాన్వాయ్‌లు, అట్టహాసమైన కార్యక్రమాలు, నాన్‌స్టాప్ పబ్లిసిటీతో కాలక్షేపం చేస్తోంది. తన క్రూరమైన విధానాలతో పేదల ఆర్థిక గౌరవాన్ని హరించివేస్తోంది" అని ఖర్గే అన్నారు.

## కేరళ ముఖ్యమంత్రిగా సతీశన్.. 11 రోజుల తర్వాత వీడిన సస్పెన్స్



**కేరళ, పతాకం న్యూస్:** కేరళ ముఖ్యమంత్రి ఎవరనే ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. 11 రోజులుగా సాగుతున్న మల్లగుల్లాలు, చర్చల అనంతరం కాంగ్రెస్ అధిష్ఠానం కేరళ ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ పేరును అధికారికంగా ప్రకటించింది. కేసీ వేణుగోపాల్, సతీశన్ మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో చివరకు సతీశన్ వైపే అధిష్టానం మొగ్గుచూపింది. ఉద్ధండుల మధ్య జరిగిన పోటీలో, పినరయి విజయన్ సర్కార్‌పై పోరాడిన అనుభవం సతీశన్‌కు కలిసి వచ్చింది. దిల్లీలో ఖర్గే, రాహుల్ గాంధీ కసరత్తు, తిరువనంతపురంలో జరిగిన శాసనసభాపక్ష సమావేశం వెరసి కేరళ సీఎంగా సతీశన్ ఎంపిక జరిగింది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ భేటీ అయి తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ నిర్ణయాన్ని కేరళ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ దీపా దాస్‌మున్షీ, పార్టీ కేంద్ర పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్, కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ప్రకటించారు. "2026 మే 7న తిరువనంతపురంలో జరిగిన కాంగ్రెస్ శాసనసభ పక్ష సమావేశంలో రాష్ట్రంలో సీఎల్పీకి కొత్త నాయకుడిని నియమించేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు పూర్తి అధికారం ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. దీనికి అనుగుణంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సహా అనేక ఇతర నాయకులతో సమావేశమైన ఏఐసీసీ పరిశీలకులతో కాంగ్రెస్ అధ్యక్షుడు, సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విస్తృత చర్చలు జరిపారు. ఈ చర్చలన్నింటి ఆధారంగా వీడీ సతీశన్‌ను సీఎల్పీ నాయకుడిగా నియమించాలని నిర్ణయించారు." అని కేరళ ఇంఛార్జ్ దాస్‌మున్షీ అన్నారు. అయితే, ప్రమాణ స్వీకారం ఎప్పుడు జరుగుతుందని ప్రశ్నించగా, తాను కేరళ వెళ్లిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

## నీట్ పరీక్ష రద్దుపై పారదర్శక విచారణ జరగాలి: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** నీట్ యూజీ 2026 పరీక్ష రద్దుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. నీట్ పేపర్ లీక్ ఘటనపై పారదర్శకంగా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్ష రద్దుతో లక్షలాది మంది విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది విద్యార్థులు షాక్‌కు గురయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరపున కేంద్రానికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తును పేపర్ లీక్ ఘటనలు దెబ్బతీస్తున్న నేపథ్యంలో పరీక్షల విశ్వసనీయతను కేంద్రం కాపాడాలని రేవంత్ రెడ్డి కోరారు. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు మళ్లీ ఇబ్బందులు పడకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే, నీట్ అక్రమాలపై పారదర్శకంగా దర్యాప్తు జరపాలని కోరారు. పోటీ పరీక్షలు అవకాశాల వేదికగా ఉండాలే తప్ప విద్యార్థుల జీవితాలను నాశనం చేసేలా మారకూడదని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీక్ వంటి వాటిల్లో బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య పోలిక ఉందంటూ సీఎం రేవంత్ రెడ్డి చురకలు అంటించారు.

## ఉబర్ సీఈఓతో చంద్రబాబు, లోకేశ్ సమావేశం



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీలో ప్రముఖ సంస్థల పెట్టుబడులు, ఆయా సంస్థల ప్రతినిధులతో కీలక సమావేశాలకు సంబంధించిన వివరాలను మంత్రి నారా లోకేశ్ ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేస్తుంటారు. తాజాగా ఉబర్ గ్లోబల్ లీడర్‌షిప్ టీమ్‌తో సీఎం చంద్రబాబు సమావేశం, చర్చించిన అంశాలను ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఉబర్ సీఈవో దారా ఖోస్రోషాహి నేతృత్వంలో ప్రత్యేక సమావేశం జరిగిందన్నారు. టెక్నాలజీ, మొబిలిటీ, ఇన్నోవేషన్‌పై విస్తృతంగా చర్చలు జరిపినట్లు చెప్పారు. స్కిల్లింగ్, అర్బన్ ట్రాన్స్‌పోర్టేషన్ భవిష్యత్తుపైనా చర్చించామన్నారు. భవిష్యత్తు నగర రవాణా విధానాలు, గ్లోబల్ కంపెనీలతో భాగస్వామ్యాల బలోపేతంపై, ఆధునిక మొబిలిటీ సొల్యూషన్స్‌పై ఉబర్ టీమ్‌తో సమీక్ష నిర్వహించినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ అవకాశాలపై చర్చలు జరిగాయని మంత్రి లోకేశ్ వెల్లడించారు. గ్లోబల్ లీడర్లతో చర్చలు ఎప్పుడూ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టెక్నాలజీ, ఇన్నోవేషన్ అవకాశాలపై దృష్టి సారించాలంటూ లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## ఎస్ఐఆర్ మూడవ దశ షెడ్యూల్ విడుదల.. ఏపీ తెలంగాణ సహా 16 రాష్ట్రాల్లో




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) మూడవ దశ షెడ్యూల్ ను భారత ఎన్నికల సంఘం (ఇసిఐ)గురువారం విడుదల చేసింది. ఏపి, తెలంగాణతో పాటు 16 రాష్ట్రాలు , 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రకియ నిర్వహించనున్నట్లు తెలిపింది. కర్ణాటక, మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, సిక్కిం, జార్ఖండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, ఉత్తరాఖండ్, త్రిపుర లలో ఎస్ ఐ ఆర్ చేపట్టనున్నట్లు ప్రకటించింది. 3.94లక్షలకు పైగా బూత్ స్థాయి అధికారులు (బిఎల్ ఒ) ఇంటింటికి వెళ్లి 36.73కోట్ల మంది ఓటర్లను సర్వే చేస్తారని తెలిపింది. ఎస్ ఐఆర్ మూడవ దశలో దేశ రాజధాని ఢిల్లీ కూడా ఉందని, అక్టోబర్ 7న తుది జాబితా ప్రచురిస్తామని వెల్లడించింది. జనగణనలో భాగంగా కొనసాగుతున్న ఇళ్ల సర్వే నేపథ్యంలో క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని దృష్టిలో ఉంచుకుని మూడవ షెడ్యూల్ ను ఖరారు చేసినట్లు ఇసిఐ తెలిపింది. మూడవ దశ పూర్తయిన తర్వాత హిమాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, లడఖ్ మినహా దేశమంతా ఎస్ ఐఆర్ చేపడతామని ప్రకటించింది. వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని హిమాచల్ ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, లడఖ్ ల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని తెలిపింది.

(మొదటిపేజీ తరువాయి)

## అవగాహన కల్పిద్దాం: చంద్రబాబు

పొదుపు చర్యలపై కార్యదర్శులు నివేదిక ఇవ్వాలని కోరారు. ఒక కేబినెట్ సబ్‌కమిటీని నియమిస్తే బాగుంటుందని వివరించారు. ముందుగా ప్రజలకు అన్ని విషయాలు విడమర్చి చెబుదామని మంత్రులు ప్రస్తావించారు. ప్రజలకు అవగాహన కలిగించిన తర్వాత మనం ఒక నిర్ణయం తీసుకుందామని డిప్యూటీ సీఎం చెప్పారు. అలాగే చేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. కాగా, మంత్రివర్గ సమావేశానికి కార్యదర్శులు సమయానికి రాకపోవడంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా సమావేశం ఉందని చెప్పిన రాకపోతే ఎలా అని సీరియస్ అయ్యారు. సీరియస్‌నెస్ లేకపోతే ఎలా అని మందలించారు. ఈ భేటీకి సమయానికి రానివాళ్ల పేర్లు రాసుకుని సీరియస్ యాక్షన్ తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగాల కల్పనపై కీలక ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కర్నూలు ఎయిర్‌పోర్ట్ పీపీపీ మోడ్‌లో అభివృద్ధిపై చర్చించారు. వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై నిర్ణయం తీసుకున్నారు. లకు నిధుల సౌలభ్యానికి ప్రత్యేక టీంను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సాగునీటి కాల్వల విస్తరణ, రోడ్లు, పరిశ్రమలకు మౌలిక సదుపాయాలపై మాట్లాడారు. శుద్ధ ఇంధనం, ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, భారీ సోలార్ ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చారు. పంప్డ్ స్టోరేజీ, బయో గ్యాస్ యూనిట్లకు అనుమతి ఇచ్చారు. శుద్ధ ఇంధనం రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. విద్యుత్ సంస్థల్లో ఇంజినీరింగ్ పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అగ్రిగోల్డ్ కేసులపై ప్రత్యేక బృందాన్ని నియమించాలని సమావేశంలో నిర్ణయించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, 16 మందికి గాయాలు

ఈ ప్రమాదంలో రాజాం సమీపంలోని పనసలవలస గ్రామానికి చెందిన నారు సాయి అనిల్ కుమార్ (24) మరణించాడు. ప్రమాద సమయంలో ఇతను బస్సు క్యాబిన్‌లో కూర్చుని ఉండగా, అద్దం పగిలి బయటకు పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో 16 మంది గాయపడ్డారు. వారిలో ఇద్దరు బస్సు డ్రైవర్లు, ఒక లారీ డ్రైవర్ సహా 13 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వారందరి పరిస్థితి నిలకడగా ఉందని, ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై దేవరపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. టిప్పర్ లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. నిద్రమత్తు వల్లే ఈ ఘోరం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

## హాజరైన ప్రధాని మోడీ

అనంతరం ఉన్నత స్థాయి దౌత్య సమావేశంలో పాల్గొంటున్న సభ్య, భాగస్వామ్య దేశాల మంత్రులు, ప్రతినిధులతో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోలు దిగారు. గురువారం నుంచి శుక్రవారం వరకు బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశాలకు న్యూఢిల్లీ ఆతిథ్యం ఇవ్వనుంది. ప్రధాని మోదీ రావడానికి ముందు ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన వివిధ దేశాల విదేశాంగ మంత్రులు, ప్రతినిధులు, అలాగే పరిశీలక దేశాల విదేశాంగ మంత్రులు, ప్రతినిధులకు కేంద్ర మంత్రి జైశంకర్ స్వాగతం పలికారు. ఈ సదస్సుకు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి, దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి రోనాల్డ్ లామోలా, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వీరాతో ఇండోనేషియా విదేశాంగ మంత్రి సుగియోనో, ఇథియోపియా మంత్రి గెడియన్ తిమోతేవోస్ హెస్సెబోన్ తదితరులు పాల్గొన్నారు.

# బలిమెల నీటి వినియోగంపై సమీక్ష సమావేశం..



**సీలేరు, పతాకం న్యూస్:** ఆంధ్రా, ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగంపై ఇరు రాష్ట్రాల అధికారులు ఒడిశాలోని ఒనకఢిల్లీలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇరు రాష్ట్రాలు 2025- 2026 నీటి సంవత్సరంలో బలిమెల జలాశయం నుంచి ఎంతె ంత నీటిని వినియోగించుకున్నాయో లెక్కించారు. ఈ నీటి సంవత్సరంలో ఏప్రిల్ 2026 నాటికి ఒడిశా 77.3178 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్టు, ఆంధ్రా తన వాటాగా ఏప్రిల్ 2026 నాటికి 57.7851 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్టు లెక్కలు కట్టారు. దీని ప్రకారం ఇప్పటి వరకు ఒడిశా.. ఆంధ్రా కంటే 19.5327 టీఎంసీల నీటిని అధికంగా వినియోగించుకున్నట్టు తేల్చారు. ప్రస్తుతం బలిమెలలో 37.27 టీఎంసీలు, జోలాపుట్టులో 6.6312 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. ఈ నెలాఖరు నాటికి బలిమెలకు నదీ పరివాహక ప్రాంతం నుంచి ఒక టీఎంసీ నీటి నిల్వలు చేరతాయని, జోలాపుట్టుకు 0.90 టీఎంసీల నీటి నిల్వలు వచ్చి చేరతాయని, వీటన్నింటితో కలిపి బలిమెల, జోలాపుట్టుల్లో మొత్తంగా 45.8012 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్టు లెక్కలు కట్టారు. ఇందులో ఏపీ వాటాగా 32.66695 టీఎంసీలు, ఒడిశా వాటాగా 13.13425 టీఎంసీలుగా పంపకాలు జరిపారు. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్, ఇరిగేషన్ అవసరాల నిమిత్తం ఆంధ్రా ఆరు వేల క్యూసెక్కులు, ఒడిశా 3,100 క్యూసెక్కుల నీటిని వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో ఒడిశా తరఫున బలిమెల ఓహెచ్‌పీసీ టెక్నికల్ వింగ్ జనరల్ మేనేజర్ ఓంప్రకాశ్ నాయక్, డివిజనల్ హెచ్‌ఆర్ మేనేజర్ బిమలటర్కీ, మేనేజర్ జ్ఞానేశ్ బెహరా, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, పొట్టేరు ఇరిగేషన్ చీఫ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్ తృపాకుమార్ పాత్ర, ఎస్‌ఈ (సివిల్) కైలాస్ సీహెచ్ సేతీ, ఏఈఈ దిలీప్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ కేసీ ఫణి, జూనియర్ ఇంజనీర్ జ్యోతి టాప్‌నో, ఆంధ్రా తరఫున సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ షేక్ జాకీర్‌హుస్సేన్, ఈఈ టి.అప్పలనాయుడు, ఏడీఈ జైపాల్ పాల్గొన్నారు.

## జీవీఎంసీకి మూడు భారీ ప్రాజెక్టులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జీవీఎంసీలో రూ.1,490.21 కోట్ల విలువైన మూడు భారీ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. అర్బన్ చాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కింద కేంద్ర ప్రభుత్వం రూ.350 కోట్లు సమకూర్చనుందని, మిగిలిన మొత్తం ఇంటర్నేషన్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) రుణం ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నతస్థాయి అధికారులతో కూడిన నేషనల్ అపెక్స్ కమిటీ సమావేశమై జీవీఎంసీకి మూడు ప్రాజెక్టులను కేటాయించేందుకు ఆమోదం తెలిపిందన్నారు. భారీమొత్తంతో కూడిన ప్రాజెక్టులను సాధించిన స్థానిక సంస్థ జీవీఎంసీయే కావడం గర్వకారణమన్నారు. మధురవాడ ప్రాంతంలోని ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది వార్డుల పరి?ధిలో రూ.648.21 కోట్లతో యూజీడీ ప్రాజెక్టుకు ఇప్పటికే టెండరు ప్రక్రియ పూర్తిచేశామన్నారు. రూ.725 కోట్లతో ఐదు నుంచి 13 వార్డుల వరకు ఉన్నప్రాంతాలకు నిరంతర తాగునీటిసరఫరా కోసం మరో ప్రాజెక్టు ఆమోదం పొందిందన్నారు. నగర పరిధిలోని బల్క్, సెమీబల్క్ కనెక్షన్‌లకు రీడింగ్ తీసేందుకు రూ.117 కోట్లతో స్కాడా యంత్రాల ఏర్పాటు, మోటారు మార్పిడికి మరో ప్రాజెక్టు ఆమోదం పొందడంతో త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. 2028 నాటికి మూడు ప్రాజెక్టులను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కమిషనర్ వివరించారు.

## తారెత్తించిన ఎండలు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలు తారెత్తించాయి. దీంతో మధ్యాహ్నం వేళ జన సంచారం లేక రహదారులు నిర్మానుష్యంగా మారాయి. దేవరాపల్లి మండలంలో 41.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. మాకవరపాలెంలో 41.2, నాతవరం, నర్సీపట్నంలో 38.8, చోడవరంలో 38.6, రోలుగుంట, రావికమతంలో 38.5, కశింకోటలో 38.4, బుచ్చెయ్యపేటలో 38.2, మాడుగులలో 37.8, చీడికాడలో 37.6, కె.కోటపాడులో 37.5, పరవాడ, సబ్బవరం, గొలుగొండలో 37.2, మునగపాకలో 37.1, కోటవురట్లలో 36.7, అనకాపల్లి లో 36.4, ఎస్.రాయవరంలో 35.6, పాయకరావుపేట, రాంబిల్లిలో 35.3, నక్కపల్లిలో 34.7, అచ్యుతాపురంలో 34.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## సాగులో ఉన్న వారందరిని రీసర్వేలో నమోదు చేయాలి



**చీడికాడ, పతాకం న్యూస్:** మండలం కోణాం రి సర్వేలో భాగంగా సాగులో ఉన్న వారందరికీ నమోదు చేసి గత రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేయాలని కోరుతూ కోణం సచివాలయం వద్ద సిపిఐ(ఎం) ఆందోళన చేపట్టింది. అనంతరం గ్రామ సచివాలయం సర్వేయర్ కి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గసభ్యులు గంటా శ్రీరామ్, సిపిఐ(ఎం) మండల కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోణం పంచాయతీలో 14 గ్రామాల్లో సుమారు 350 నుండి 400 వరకు గిరిజనులు, పేద రైతులు వాళ్ళ తాత తండ్రుల నుండి ఆ భూమిని సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని, వారందరికీ న్యాయం చేయాలని కోరారు. గత 60 సంవత్సరాల నుండి అనేకమార్లు అధికారులు దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదని ఇప్పుడు ప్రభుత్వం చేస్తున్న రీసర్వే ద్వారా అయినా గత తప్పులను సరిచేయాలని కోరారు. ఏ భూములు ఎవరు సాగుదారులుగా ఉన్నారో వారందరికీ న్యాయం చేయాలని అన్నారు. న్యాయం జరిగేంత వరకు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, దుప్పు దాసు, చలుగు భీము నాయుడు, దారకొండ, బొబ్బరి నాగరాజు, చలుగు శ్రీనివాసరావు, గాలి సన్యాసిరావు పాల్గొన్నారు.

## మద్యం షాపులకు స్వచ్ఛ రథాలు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** జిల్లాలో మద్యం దుకాణాల వైపు స్వచ్ఛ రథాలు కదులుతున్నాయి. మద్యం దుకాణాలు, పర్మిట్ రూమ్‌లు, బార్లలోని ఘన వ్యర్థాలను స్వచ్ఛ రథాలకు అప్పగించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో పాటు వీటి పర్యవేక్షణ బాధ్యతలను ఎక్సైజ్ అధికారులు, ఎంపీడీవోలకు అప్పగించారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ రథాల ద్వారా ఘన వ్యర్థాలు సేకరిస్తూ ప్రత్యామ్నాయంగా నిత్యావసర సరుకులు ఇస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా వైన్ షాపులు, బార్లలోని ఘన వ్యర్థాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 24 స్వచ్ఛ రథాలు వాటి పరిధిలోని మద్య షాపులు, బార్ల వద్దకు వెళ్లి ఘన వ్యర్థాలు సేకరించాలి. మద్యం షాపుల వద్ద ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు రోడ్ల మీద, ఖాళీ స్థలాలు, డ్రైనేజీల్లో పడేస్తున్నారు. దీని వలన పారిశుధ్య సమస్య తలెత్తడంతో పాటు దోమల బెడద పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇకపై అటువంటి పరిస్థితి లేకుండా చూసుకోవల్సిన బాధ్యత వైన్ షాపు లైసెన్స్‌దారుడిపై పెట్టారు. మద్యం దుకాణంలో రోజువారీ పోగైన ప్లాస్టిక్ ఖాళీ వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు, గ్లాసులు ఒక గోనె సంచెలో మూట కట్టి స్వచ్ఛ రథం వచ్చిన తరువాత అందజేయాలి. ఒకవేళ స్వచ్ఛ రథం రావడం ఆలస్యమైతే పంచాయతీ గ్రీన్ అంబాసిడర్ (పారిశుధ్య కార్మికుడు)కి అప్పగించాలి. ఎట్టి పరిస్థితుల్లో రోడ్ల మీద వ్యర్థాలు పడేయకూడదని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో 155 వైన్ షాపులు, పర్మిట్ రూమ్‌లు, 13 బార్లు ఉన్నాయి. ఘన వ్యర్థాలు స్వచ్ఛ రథాలకు అప్పగించేలా చూడాలని ఎక్సైజ్ అధికారులు, ఎంపీడీవోలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 11 ప్రాంతాల్లో ప్రభుత్వం ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు ఏర్పాటు చేయబోతుంది. ప్లాస్టిక్ వ్యర్థాలను బెయిలింగ్ చేసే యంత్రాలను మంజూరు చేసింది. పది బస్తాల్లోని ప్లాస్టిక్ బాటిల్స్ బెయిలింగ్ మెషీన్‌లో వేస్తే చిన్న మూటగా మారిపోతుంది. దీని వలన వ్యర్థాలు తరలించడానికి కూడా సులభతరం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. గ్రామాలు, వైన్ షాపులు, బార్ల వద్ద సేకరించిన ఘన వ్యర్థాలు ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ యూనిట్‌కి తరలిస్తారు.

## అరకు కాఫీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



**గూడెంకొత్తవీధి, పతాకం న్యూస్:** అరకు కాఫీ అభివృద్ధికి కేంద్ర కాఫీ బోర్డు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసిందని సీఈవో, కార్యదర్శి ఎం.కూర్మారావు అన్నారు. కేంద్ర కాఫీ బోర్డు చైర్మన్ డాక్టర్ ఎంజే దినేశ్‌తో కలిసి ఆయన ఆర్‌వీనగర్ ప్రాంతీయ కాఫీ పరిశోధన స్థానాన్ని సందర్శించారు. పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న కాఫీ తోటలు, పరిశోధనలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూర్మారావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో కాఫీ పంట ఆదివాసీల జీవితాల్లో పెను మార్పును తీసుకొచ్చిందన్నారు. ఆదివాసీ ప్రధాన వాణజ్య పంట స్థానాన్ని సొంతం చేసుకుని జీవనాధారంగా మారిందన్నారు. అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపురావడం, స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోత్సహించడం శుభపరిణామమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాఫీ సాగుకు అందిస్తున్న సహాయ, సహకారాల వల్ల ఆదివాసీ రైతులు కాఫీ సాగులో ముందంజలో వున్నారన్నారు. ప్రపంచ దేశ కాఫీ ప్రియులు అరకు కాఫీ రుచులను ఆస్వాదించేందుకు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. కాఫీ సాగుతో పాటు గిరిజన రైతుల ఆర్థిక ప్రగతికి వాణిజ్య సరళిలో సాగు చేసేందుకు అనువైన ఉద్యాన పంటలపై అధ్యయనం చేస్తున్నామన్నారు. కాఫీ తోటల్లో గిరిజన రైతులు మిరియాల పంటను సాగు చేస్తున్నారన్నారు. రైతులకు ప్రధాన పంట కాఫీతో పాటు మిరియాల పంట ద్వారా ఆదాయం సమకూరుతుందని తెలిపారు. కాఫీకి నీడనిచ్చేందుకు సిల్వర్ ఓక్ మొక్కలను పెంచుకుంటున్నారన్నారు. రైతులు నీడ కోసం ఉద్యాన పంటల మొక్కలను నాటుకోవడం వల్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు. కాఫీ తోటల్లో ఆవకాడో తరహాలో పండ్ల మొక్కల సాగు చేసుకునేందుకు ఉద్యానశాఖ అధికారులతో చర్చిస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే అరకులోయలో గురువారం ఆంధ్ర, ఒడిశా కాఫీ రైతులతో వర్కుషాపు ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజనులు కాఫీ సాగులో ప్రగతి సాధించేందుకు 50 ఏళ్లగా ఆర్‌వీనగర్ ప్రాంతీయ కాఫీ పరిశోధన స్థానం విశిష్ట కృషి చేస్తున్నదన్నారు. ఈ 50 ఏళ్లలో గిరిజన రైతులకు అరబికాలో 15, రొబస్టాలో రెండు రకాల నాణ్యమైన విత్తనాలను అందజేసిందని చెప్పారు. పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, విస్తరణ విభాగం అధికారులు గిరిజన రైతులకు ఎప్పటికప్పుడు సాగులో మెలకువలు, నూతన యాజమాన్య పద్ధతులను పరిచయం చేస్తున్నారన్నారు.

## అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు



**రావికమతం, పతాకం న్యూస్:** జిల్లాలో అసంపూర్తిగా ఉన్న 208 అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలను పూర్తిచేసేందుకు రూ.11 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి తెలిపారు. ఆమె రావికమతంలో నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో మాట్లాడుతూ, జిల్లాలో తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,908 అంగన్‌వాడీ కేంద్రాలు వున్నాయన్నారు. కొన్ని కేంద్రాల్లో ఖాళీగా వున్న 236 కార్యకర్తలు, ఆయాల పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీచేసినట్ట చెప్పారు. ఖాళీగా వున్న 24 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు వెల్లడించారు. జిల్లాలో ప్రస్తుతం 7,383 మంది గ ర్భిణులు, 6,662 మంది బాలింతలు, ఏడు నెలల నుంచి ఆరు సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు పోషకాహారాన్ని అందజేస్తున్నామని వివరించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి జూన్ తొమ్మిదో తేదీ వరకు కిశోర/ కిశోరి వికాసం పేరుతో బాలబాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పోషకాహారం ఆవశ్యతపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో వున్న బాలికలను 15 నుంచి 20 మందిని గ్రూపుగా ఏర్పాటు చేసి మంగళ, శుక్రవారాల్లో ఉదయం అమ్మాయిలకు, సాయంత్రం అబ్బాయిలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో వి.మంగతాయారు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.రమేశ్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## సచివాలయాల పేరు మార్పు ఏదీ?




**రావికమతం, పతాకం న్యూస్:** గ్రామ సచివాలయాలను స్వర్ణ గ్రామంగా పేరు మారుస్తూ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఉత్తర్వులు ఇచ్చినా, ఇంకా సచివాలయాలుగానే కొనసాగుతుండడంతో క్షేత్రస్థాయిలో గందరగోళం నెలకొంది. కార్యాలయాలపై ఇప్పటి వరకు సచివాలయాల పేరు మార్చలేదు. అధికారులు మాత్రం స్వర్ణ గ్రామంగా కాగితాల్లో మాత్రమే చూపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సచివాలయాల వ్యవస్థను క్రమబద్ధీకరించే క్రమంలో కీలకమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగానే పంచాయతీల్లో జనాభా, ఆదాయం, ఇతర అంశాల ఆధారంగా ఆ సచివాలయాల్లో ఎంతమంది సిబ్బంది అవసరమో అంతమందిని మాత్రమే ఉంచి, అదనంగా ఉన్న సిబ్బందిని ఇతర శాఖలకు సర్దుబాటు కింద పంపించింది. ఈ ప్రక్రియ చేపట్టి సచివాలయాల్లో మిగులు సిబ్బందిని ఇతర శాఖలకు కేటాయింపు పూర్తి చేసింది. అలాగే సచివాలయాల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా మండల స్థాయి అధికారిని కూడా నియమించింది. ఇంత వరకు బాగానే ఉన్నా పేరు మార్పు విషయంలో మాత్రం గందరగోళం నెలకొంది. గ్రామ సచివాలయాలను స్వర్ణ గ్రామంగా, వార్డు కార్యాలయాన్ని స్వర్ణ వార్డుగా పేరు మారుస్తూ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం గ్రామ సచివాలయాన్ని స్వర్ణ పంచాయతీగా, పెద్ద పంచాయతీల్లో వార్డు సచివాలయాలను స్వర్ణ వార్డుగా మార్పు చేయాల్సి ఉంది. అయితే ఈ ఆదేశాలు వచ్చి మూడు నెలలు అవుతున్నా ఇంకా క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యాలయాలు సచివాలయాలుగానే కొనసాగుతున్నాయి. కనీసం కార్యాలయాలపై పేరు మార్చలేదు. దీంతో ప్రజల దృష్టిలో ఇంకా సచివాలయాలుగా కొనసాగుతుండగా, అధికారులు మాత్రం స్వర్ణ గ్రామంగా కాగితాల్లో నడిపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి సచివాలయాల పేరు మార్పు చేసి గందరగోళానికి తెరదించాలని పలువురు కోరుతున్నారు.

## మోదకొండమ్మ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



**పాడేరు, పతాకం న్యూస్:** స్థానిక మోదకొండమ్మ ఉత్సవాలు ఈ నెల 17, 18, 19 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్సవాలకు సంబంధించిన వ్యవహారాల్లో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ స్టాళ్ల ఏర్పాటు, పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, రవాణా సౌకర్యాలు, భోజన వసతి సదుపాయాలు, ప్రజా మరుగు దొడ్ల ఏర్పాటు, పోలీస్ బందోబస్తు, అగ్నిమాపక శకటాల ఏర్పాటు, వైద్య సేవలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రధానంగా తాగునీటి సమస్యలు ఏర్పడకుండా నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. పండుగ రోజుల్లో విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాల నుంచి అదనపు పారిశుధ్య సిబ్బందిని రప్పించి పనులు చేయాలని పంచాయతీ విభాగం అధికారులకు సూచించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు ఆమె సూచించారు. అధికారులు, ఉత్సవ కమిటీ సమన్వయంతో పని చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తుల రాకపోకలకు వంద ఆర్‌టీసీ బస్సులను నడపాలన్నారు. ఆయా శాఖలకు చెందిన అధికారులకు అప్పగించిన పనులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.శ్రీపూజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, డ్వామా పీడీ విద్యాసాగరరావు, జిల్లా ఉద్యానవనాధికారి కె.బాలకర్ణ, నేచురల్ ఫార్మింగ్ జిల్లా మేనేజర్ ఎల్.భాస్కరరావు, డీపీవో చంద్రశేఖరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వీబీ నాగేశ్వరరావు, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, పీఆర్ ఈఈ టి.కొండయ్యపడాల్, డీఈవో రామకృష్ణారావు, టీడబ్ల్యూ డీడీ పీబీకే.పరిమిళ, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీబాయి, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ అధికారి జి.గౌరీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లలో ఆర్వోబీల నిర్మాణం పూర్తి

### కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో రికార్డు స్థాయిలో చేపడుతున్న ఆర్వోబీల నిర్మాణాన్ని వేగవంతంచేసి, రాబోయే రెండేళ్లలోగా పూర్తిచేస్తామని కేంద్ర పౌరవిమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. ఆయన ఢిల్లీలోని తన కార్యాలయం నుంచి జిల్లా ఉన్నతాధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో కొన సాగుతున్న పలు కీలక ప్రాజెక్ట్‌ల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాల కల్పనతో త్వరలో శ్రీకాకుళం కొత్త రూపు సంతరించుకోనుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. జిల్లా ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీర్చి, సాఫీ ప్రయాణాన్ని చేరువ చేసేందుకు ఆర్వోబీల నిర్మాణం అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌లకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఉన్న భూసమస్యల పరిష్కారానికి వెంటనే ఒక పూర్తిస్థాయి నోడల్ అధికారిని నియమించాలని అధికారులను ఆదేశించారు. చారిత్రక అరసవల్లి, శ్రీకూర్మం ఆలయాల సమగ్ర అభివృద్ధిపై మంత్రి ఈ సమీక్షలో ప్రత్యేకంగా చర్చించారు. మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు, పరిశ్రమల ప్రోత్సాహానికి ఎంఎస్ఈ పార్కుల పనులను వేగవంతం చేయాలన్నారు. ఎయిర్‌ఫోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ నిధులతో జిల్లా గ్రంథాలయం ఆధునీకరణతో పాటు, కొత్తగా 4 పబ్లిక్ పార్కుల అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. జిల్లాలో వైద్య సేవలను మరింత మెరుగుపరచడంలో భాగంగా రిమ్స్, జీజీహెచ్ అభివృద్ధి పనుల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా పాత్రునివలస వద్ద స్టేడియం నిర్మాణ పనులు, నగరంలోని కేఆర్ స్టేడియం ఆధునీకరణ పనుల పురోగతిపై ఆరా తీశారు. జిల్లాలో ఉన్న అపార వనరులను, సామర్థ్యాన్ని ప్రదర్శించి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేయాలని మంత్రి సూచించారు. మౌలిక సదుపాయాల వృద్ధి, ఆర్థిక పురోగతి ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించాలన్నారు. ఈ దిశగా అధికారులంతా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ఏర్పాట్లపై మంత్రి రామ్మోహన్‌నాయుడు అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ వర్చువల్ సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మంత్రి ప్రైవేటు సెక్రటరీ శ్రీకేష్ లాత్కర్, సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## నోయిడా కార్మికులపై నిర్బంధాలు ఆపాలి




**అరసవల్లి, పతాకం న్యూస్:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడా కార్మికులపై ప్రభుత్వ నిర్బంధ చర్యలు ఆపా లని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వా లని, 8 గంటల పనిదినం అమలు చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ కూడ లి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, పి.తేజేశ్వరరావు, ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.తిరుపతిరావు, ఇఫ్టూ జిల్లా నాయకురాలు ఎస్.కృష్ణవేణి మాట్లాడుతూ.. లేబర్ కోడ్లతో కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. పని గంటలను తగ్గించాలని పోరాటం చేస్తుంటే అక్కడి ప్రభుత్వం కేసు లను అక్రమంగా బనాయించి ఉద్యమాలను అణచివేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. నోయిడా కార్మి కుల డిమాండ్లను పరిష్కరించకుంటే దేశవాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు అల్లు సత్యనారాయణ, ఎం .గోవర్ధనరావు, ఎన్.బలరాం, ఎం.రాఘవ, ఎం.నాగేశ్వర రావు, డి.రాము, కేదారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన పొదుపు... కాన్వాయ్ వదిలేసి బైక్ పై ప్రయాణించిన మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్



**అరసవల్లి, పతాకం న్యూస్:** మహారాష్ట్ర ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ గురువారం అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆయన తన అధికారిక నివాసం నుంచి విధాన్ భవన్‌కు బైక్‌పై ప్రయాణించారు. ఇంధనాన్ని ఆదా చేయా లన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, ఫడ్నవీస్ ఈ విధంగా తన వంతు సందేశాన్ని ప్రజలకు ఇచ్చారు. గురువారం జరిగిన శాసనమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు, ఫడ్నవీస్ బీజేపీ నేత, మంత్రి ఆశీష్ షెలార్‌తో కలిసి బైక్‌పై వెళ్లారు. దాంతో ఫడ్నవీస్ భద్రతా సిబ్బంది కూడా ఆయనను బైక్ లపై అనుసరించారు. ఈ ప్రయాణంలో ఫడ్నవీస్ రాయల్ ఎన్ ఫీల్డ్ క్లాసిక్ 350 (స్టెల్త్ బ్లాక్ కలర్) బైక్ ను ఉపయోగించారు. ఇదే స్ఫూర్తితో మరో మంత్రి నితేష్ రాణే సచివాలయానికి ఏకంగా నడిచి రావడం విశేషం. ఇంధన పొదుపు కోసం మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు కఠిన చర్యలను ప్రకటించింది. ఇందులో భాగంగా మంత్రుల కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను సగానికి తగ్గించాలని నిర్ణయించారు. అంతేకాకుండా మంత్రులు, ప్రభుత్వ అధికారుల విదేశీ పర్యటనలను పూర్తిగా రద్దు చేశారు. ప్రభుత్వ శాఖలకు కేటాయించిన వాహనాలపైనా సమీక్ష జరుపుతామని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరాపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఇంధనంతో పాటు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

## రౌడీషీటర్లకు క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** రౌడీషీటర్లకు క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ నిర్వహిస్తూ.. వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కోరారు. కాశీబుగ్గ డీఎస్పీ కార్యాలయంలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్‌బెయిలబుల్ వారెంట్ల అమలును వేగవంతం చేయాలన్నారు. పోక్సో, మహిళలపై జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండడంతో పాటు వారికి న్యాయం చేకూరే విధంగా చర్యలు తీ సుకోవాలని స్ప ష్టం చేశారు. గంజాయి, దొం గతనాల కేసుల దర్యాప్తు వేగ వంతంగా పూ ర్తి చేయాలని, దొంగ తనానికి గు రైన ఆస్తులను రికవరీ చేయాలని ఆదేశించారు. కా శీబుగ్గ సబ్ డివి జన్‌లో నేర నియంత్రణకు పటి ష్ఠంగా కృషి చే యాలన్నారు. అ సాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని, డ్రోన్ సాయంతో నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పేకాట, గంజాయి, డంకన్‌డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ వంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా పెంచాలని ఎస్పీ ఆదేశించారు. విజబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతా భావాన్ని పెంచాలన్నారు. ప్రజాఫిర్యాదులు స్వీకరించడంతో పాటు వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, మహిళల భద్రత, సంబంధిత చట్టాలపై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సబ్‌డివిజన్‌లో నమోదవుతున్న కేసులు, దర్యాప్తులో పురోగతి, పెండింగ్‌లో ఉన్న కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టులు, ఛార్జ్‌షీట్ల దాఖలు వంటి అంశాలపై ఆరా తీశారు. కాశీబుగ్గ, టెక్కలి డీఎస్పీలు టి.భవాని, డి.లక్ష్మణరావు, సీఐలు వై.రామకృష్ణ, మంగపతిరావు పాల్గొన్నారు.

## నిరంతరంగా ఆధార్ సేవలు




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలోని సబ్ పోస్టాఫీసు ల్లో ఆధార్ బయోమెట్రిక్ సేవలను నిరంతరం అందిస్తున్నట్లు శ్రీకా కుళం తపాలాశాఖ సూపరింటెం డెంట్ హరిబాబు తెలిపారు. స్థానిక సబ్ పోస్టాఫీసులో పార్సిల్ ప్యాకింగ్ యూనిట్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. నూతన ఆధార్ కార్డులతో పాటు ఆధార్ బయో మెట్రిక్ సేవల్లో సాంకేతిక సమస్యలను పరిష్కరించేం దుకు పోస్టాఫీసుల్లో ఆధార్ కేంద్రాలను తెరిచామన్నారు. బాల ఆధార్‌కార్డులతోపాటు బయో మెట్రిక్ సేవలు అందుతాయన్నారు. పిల్లల నూతన ఆధార్ కార్డు తయారీ లో మూడు దశల్లో ఒకసారి ఉచితంగా సేవలు అందిస్తా మన్నారు. ఉపాధి హామీ కార్మికులు తమ బయోమెట్రిక్ సేవలను పోస్టాఫీసుల్లో వినియోగించు కోవాలన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం జిల్లాలో ఎక్కువ డిమాండ్ ఉన్న సోంపేట, రాజాం, నరసన్నపేట, టెక్కలి, పొందూరు తదితర పోస్టాఫీసుల్లో పార్సిల్ ప్యాకింగ్ యూనిట్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దీని లో భాగంగా పోస్టాఫీసుల్లో అందించే పార్సిల్ యూని ట్లతో కస్టమర్ల పార్సిళ్లు సురక్షితంగా గమ్యస్థానానికి చేరు కుంటా యన్నారు. ప్రైవేటు కొరియర్‌ల కంటే మెరుగైన కొరియర్ సౌకర్యాన్ని పోస్టాఫీసుల్లో అందిస్తున్నామని, వినియోగ దారులు ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్ పోస్టుమాస్టర్ ఎం.ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు




**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లా కేంద్రంలో బాలికపై అత్యా చారానికి పాల్పడిన రాజేటి సత్యారావు(53)అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు విజయనగరం ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్.రాఘవులు విలేకరులకు తెలిపారు. వేసవి సెలవులు కావడంతో తన అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలిక ఈ నెల 10న నిందితుడి ఇంటికి పాలు పోసేందుకు వెళ్లిందని తెలిపారు. పాల డబ్బులు ఇస్తానని చెప్పి లోపలికి పిలిచిన నిందితుడు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడని చెప్పారు. ఈ విషయం ఎవరికైనా చెబితే అంతుచూస్తానని నిందితుడు బెదిరించాడని తెలిపారు. ఒంటిమీద గాయాలను చూసి తల్లి ప్రశ్నించడంతో జరిగిన విషయాన్ని బాలిక బయట పెట్టిందని డీఎస్పీ వివరించారు. ఈ మేరకు విజయనగరం మహిళా పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. ఎస్ఐ జి.శిరీష పోక్సో కేసు నమోదు చేశారని చెప్పారు. నగరంలోని బీసీ కాలనీకి చెందిన నిందితుడు రాజేటి సత్యారావును సీఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారని డీఎస్పీ రాఘవులు చెప్పారు.

## మండుటెండలో విద్యార్థుల పడిగాపులు



**తిరుపతి, పతాకం న్యూస్:** పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గురువారం నిర్వహించిన బడిపిలుస్తుంది కార్యక్రమం ఉదయం 10 పది గంటలకు ప్రారంభం కావాల్సివుంది. అయితే ఈ కార్యక్రమం గంట ఆలస్యం గా ప్రారంభం కావడం తో విద్యార్థులు జిల్లా విద్యాశాఖధికారికి స్వాగతం పలికెందుకు బాలాయపల్లి ఉన్నత పాఠశాల ముఖ ద్వారం వద్ద పడిగాపులు పడాల్సి వచ్చింది. సభా ప్రాగణంలో విద్యార్థులు మండుటెండలో కూర్చుని ఎదురు చూడాల్సి వచ్చింది. విద్యార్థుల సమస్యలపై స్పందించాల్సిన జిల్లా అధికారి కోసం విద్యార్థులు మండు టెండలో కూర్చోపెట్టడం పై విద్యార్థుల తల్లి తండ్రులు మండిపడుతున్నారు. మండల శాఖ అధికారులు వ్యవహ రించిన తీరు ప్రభుత్వ పాఠశాలలను అపహాస్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఐదు కిలోల గంజాయి స్వాధీనం




**ఇచ్ఛాపురం, పతాకం న్యూస్:** ఒడిశా నుంచి జార్ఖండ్ రాష్ట్రానికి తరలిస్తున్న ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. జార్ఖండ్ రాష్ట్రం వెస్ట్ సింగ్‌భూమ్ జిల్లాకు చెందిన రాజ్ఞా అభిషేక్ రాజ్‌సింకు ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేసి జార్ఖండ్ రాష్ట్రానికి వెళ్లేందుకు గాను ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫాంకు వచ్చాడు. ఆర్థిక పరిస్థితి బాగులేక పోవడంతో తన బంధువు అయిన అనురాగ్ ఫట్ గంజాయి వ్యాపారికి తనకు పని కల్పించాలని కోరినట్లు తెలిపాడు. అతనిని కలిసి ఒడిశా రాష్ట్రం కాంధామాల్ ప్రాంతం నుంచి గంజాయి తీసుకువచ్చినపుడు తనకు సాయంగా ఉంటే ఒక పర్యాయానికి రూ.10 వేలు ఇస్తానని చెప్పాడన్నారు. రాజ్ఞా అభిషేక్ కాంధామాల్ వెళ్లి కరణ నాయక్ నుంచి సుమారు ఐదు కిలోల గంజాయి తీసుకురమ్మన్నాడని చెప్పారు. అతడు చెప్పిన విధంగా బుధవారం సాయంత్రం గంజాయి పట్టుకుని భువనేశ్వర్ మీదుగా జార్ఖండ్ తీసుకువెళ్లేందుకు రైలు నిలయానికి వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి సోంపేట కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ మహేశ్వర్ రెడ్డి అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ముకుందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## మ్యుటేషన్లను 15 రోజుల్లో పరిష్కరించాలి: కలెక్టర్



**విజయనగరం, పతాకం న్యూస్:** పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లను 15 రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తిరస్కరణకు గురైన మ్యుటేషన్లపై సభలు పెట్టి కారణాలు వివరించాలని అన్నారు. వంగర, చీపురుపల్లి భోగాపురం, డెంకాడ, కొత్తవలస, గంట్యాడ తహసీల్దార్లతో మాట్లాడుతూ ఎక్కువ మొత్తంలో మ్యుటేషన్లు పెండింగులో ఉండటానికి కారణాలు అడిగారు. తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రతి రోజు సమీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో జేసీ సేతుమాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి చందక సత్తిబాబు, ఆర్‌డీవోలు సుధాసాగర్, రామ్మోహన్, సుధారాణి ఉన్నారు. జలధార-జలహారతి కింద మంజూరైన పనులన్నీ వెంటనే ప్రారంభం కావాలని కలెక్టరు రామసుందర్ రెడ్డి తెలిపారు. తాగునీరు, జలధారపై మండలాల వారీగా బుధవారం సమీక్షించారు. నిధులు పరిమితంగా ఉన్నందున ప్రాధాన్యతననుసరించి పనులను ప్రతిపాదించాలన్నారు. ప్రతి పనికీ ప్రణాళిక వేసుకోవాలన్నారు. జిల్లాలో 13,555 పనులు మంజూరు కాగా ఇప్పటి వరకూ 5026 పనులు మాత్రమే ప్రారంభం అయ్యాయని, మిగిలిన పనులు వెంటనే ప్రారంభం కావాలన్నారు. ఇంటింటికీ జరుగుతున్న జనాభా లెక్కింపును వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. అధికారులుతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకూ 27.9 శాతం మాత్రమే పూర్తయ్యిందని, ఈనెల 20 నాటికి పూర్తి చేయాల్సి ఉందన్నారు. డైలీ ప్రోగ్రెస్ కనపడాలని, అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టరు రామసుందర్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా శాఖల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గిరిజన విశ్వవిద్యాలయం, తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు, జాతీయ రహదారులు, కొత్తవలస- విజయనగరం -సంబలపూర్ నాలుగో రైల్వేలైన్ పనులకు భూసేకరణ పూర్తి చేయాలన్నారు. ఉత్తరాంధ్ర సుజలస్రవంతి ప్రాజెక్టు యూనిట్ 2 కోసం జే.గుమడాం, బి,రాజేరు, జిన్నాం, బొండపల్లి గ్రామాల్లో భూసేకరణ కోసం పబ్లిక్ నోటీసులు జారీ చేయాలన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**విజయనగరం, పతాకం న్యూస్:** విజయనగరంలో విషాదం చోటుచేసుకుంది. అయ్య కోనేరు చెరువులో చేపల వేటకు వెళ్లిన ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు మృతి చెందారు. వివరాల ప్రకారం.. గురువారం ముగ్గురు వ్యక్తులు చేపలు పట్టేందుకు చెరువులోకి దిగారు. అయితే, లోతుగా ఉన్న ప్రాంతానికి వెళ్లిన సమయంలో ఒక వ్యక్తి నీటిలో మునిగిపోయాడు. మిగిలిన ఇద్దరు వ్యక్తులు అతడిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది.

# ‘మధురవాడ’లో మౌలిక వసతులపై జీవీఎంసీ దృష్టి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ ప్రాంతంలో మౌలిక వసతులను మెరుగుపరచడంపై జీవీఎంసీ దృష్టిసారించింది. రూ.648.21 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) ప్రాజెక్టుతోపాటు రూ.725 కోట్లతో నిరంతర నీటి సరఫరా ప్రాజెక్టును కేటాయించింది. యూజీడీ ప్రాజెక్టుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తికాగా, నిరంతర నీటిసరఫరా ప్రాజెక్టుకు త్వరలోనే టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే మధురవాడ మరింతవేగంగా అభివృద్ధిచెందడంతో పాటు రూపురేఖలు మారిపోతాయని అధికారులు చెబుతున్నారు. ఒకప్పుడు నగరానికి శివారు ప్రాంతంగా భావించే మధురవాడ, ఆరిలోవ ప్రాంతాలు ఇప్పుడు ఐటీ కంపెనీలు, డేటాసెంటర్, హెల్త్‌సిటీల రాకతో ఊహించని విధంగా అభివృద్ధి చెందాయి. ఈ నేపథ్యంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పార్కులు, యూజీడీ వంటి మౌలిక సదుపాయాల కల్పనపై జీవీఎంసీ దృష్టిసారించింది. ప్రస్తుత అవసరాలను తీర్చడమే కాకుండా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మధురవాడ ప్రాంతంలో యూజీడీ సదుపాయం లేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. 40 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది వార్డుల్లో యూజీడీ సదుపాయం కల్పించేందుకు రూ.648.21 కోట్లు అవసరయని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు తయారుచేశారు. అంతమొత్తాన్ని జీవీఎంసీ వెచ్చించే పరిస్థితి లేకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో ప్రపంచబ్యాంక్‌కు అనుబంధంగా పనిచేసే ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) ద్వారా రుణం తీసుకోవాలని నిర్ణయించారు. మరికొంత మొత్తాన్ని సర్దుబాటుచేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనివల్ల మధురవాడ ప్రాంతంలోని 21,800 ఇళ్లకు యూజీడీ అందుబాటులోకి వస్తుంది. 450 కిలోమీటర్ల పొడవున పైప్‌లైన్ నెట్‌వర్క్‌తోపాటు రెండు చోట్ల పంప్‌హౌస్‌లు నిర్మించి, కాపులుప్పాడలో 20 ఎంఎల్‌డీ సామర్థం కలిగిన ఎస్‌టీపీ (సీవరేజ్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్)ను కాపులుప్పాడవద్ద నిర్మించేలా డిజైన్ తయారుచేశారు. శుద్ధిచేసిన నీటిని పరిశ్రమలకు విక్రయించడం ద్వారా వచ్చే డబ్బుతో పాటు ఆస్తిపన్ను, యూజీడీ యూజర్ చార్జీల ద్వారా ఐఎఫ్‌సీ రుణం తీర్చాలని నిర్ణయించారు. దీంతో రెండు నెలల కిందటే అధికారులు టెండర్ పిలవడంతో అయ్యప్పకన్‌స్ట్రక్షన్స్ పనులను దక్కించుకుంది. రెండేళ్లలో పూర్తిచేయాలని అధికారులు లక్ష్యం విధించారు. ప్రాజెక్టు వ్యయంలో 25 శాతం (రూ.164కోట్లు) అర్బన్ ఛాలెంజ్‌ఫండ్ ద్వారా సర్దుబాటు చేసేందుకు మంగళవారం కేంద్రప్రభుత్వం ఆమోదం తెలపడంతో జీవీఎంసీపై ఆర్థికభారం తగ్గింది.

మధురవాడ ప్రాంతానికి ప్రస్తుతం కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (కేబీఆర్) నుంచి పైప్‌లైన్ ద్వారా ఎండాడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి మధురవాడ, ఆరిలోవ ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో జనాభా పెరిగిపోతుండడంతో తాగునీటికి డిమాండ్ పెరిగి సరఫరాపై ప్రభావం పడుతోంది. గూగుల్‌డేటా సెంటర్, ఐటీ కంపెనీలు, భోగాపురం ఎయిర్‌పోర్టు వస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో నీటికి మరింత డిమాండ్ పెరుగుతుంది. దీంతో కేవలం మధురవాడ, ఆరిలోవ ప్రాంతాలకు (వార్డు నంబరు ఐదు నుంచి 13 వరకు) ప్రతీ రోజూ 64 ఎంఎల్‌డీ నీటిని నిరంతరం (24o7) సరఫరా చేసేలా రూ.725 కోట్లతో ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఈ మొత్తంలో ముడసర్లోవ వద్ద ట్రీట్‌మెంట్‌ప్లాంట్ నిర్మించి, నరవ నుంచి నీటిని పైప్‌లైన్ ద్వారా తీసుకొచ్చి శుద్ధిచేయనున్నారు. ఈ నీటిని పైప్‌లైన్ ద్వారా ఎండాడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేసి అక్కడి నుంచి దాదాపు 25 వేల ఇళ్లకు నిరంతరం సరఫరా చేసేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఇందుకు అయ్యే వ్యయంలో 25 శాతం (రూ.181కోట్లు)ని యూసీఎఫ్ కింద కేంద్ర ప్రభుత్వం జీవీఎంసీకి సర్దుబాటు చేసేందుకు అంగీకారం తెలిపింది. మిగిలిన మొత్తాన్ని ఐఎఫ్‌సీ నుంచి రుణంగా సమకూర్చుకునేందుకు ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్టును కూడా 2028 నాటికి పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రెండు ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తూ మధురవాడ, ఆరిలోవ పరిసరప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడి ఆ ప్రాంతరూపురేఖలు మారిపోతాయని భావిస్తున్నారు.

## పెరగనున్న ఎండల తీవ్రత



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ఎండ తీవ్రత, వడగాడ్పులు మరింత పెరగనున్నాయని, గురువారం గరిష్టంగా 43 నుంచి 44 డ్రిగీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జికె వీధి మండలం, పోలవరం జిల్లాలోని చింతూరు, కూనవరం, గుర్తేడు మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు. శుక్రవారం ఒక మండలంలో తీవ్ర వడగాడ్పులు, 15 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు అల్పపీడనం ప్రభావంతో గురువారం నుంచి రెండు రోజులపాటు రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. బుధవారం నాడు చిత్తూరు జిల్లా రాయలపేటలో 43.7 డిగ్రీలు నమోదైందని తెలిపారు. 22 జిల్లాల పరిధిలోని 143 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు.

## టిడ్కో డిపాజిటర్లకు సొమ్ము వాపస్




**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుపతిలో టిడ్కో హౌసింగ్ డిపాజిటర్లకు సొమ్ము వాపస్ చేయడం మొదలైంది. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో రీఫండ్ చెక్కులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ టిడ్కో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం 2472 మంది డిపాజిటర్ల నుంచి ప్రభుత్వం దాదాపు రూ.5 కోట్లు కట్టించుకున్నట్లు చెప్పారు. అయితే తరువాత వచ్చిన వైసీపీ సర్కారు టిడ్కో ప్రాజెక్టును రద్దు చేసినప్పటికీ డిపాజిటర్లకు వారు చెల్లించిన నగదును తిరిగివ్వలేదన్నారు. డిపాజిటర్లకు సొమ్ము రీఫండ్ చేయాలని తాను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా వారు అంగీకరించారన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ శారదాదేవి మాట్లాడుతూ 2472 మందిలో డబుల్ పేమెంట్లు పోనూ ఇప్పటి వరకు 1890 మంది మిగిలారన్నారు. వీరిలో 20 మంది ఆధార్ కార్డులు సరిపోలేదని చెప్పారు. డాక్యుమెంటేషన్ వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. ఇది పూర్తయిన వెంటనే మూడు దశల్లో డిపాజిటర్లకు వారి ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామని తెలిపారు. ఏపీ గ్రీనరీ, బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు టిడ్కో ప్రాజెక్టు ప్రారంభించామన్నారు. ప్రస్తుతం టిడ్కో ప్రాజెక్టు రద్దు చేయడంతో డిపాజిటర్లకు వారి అమౌంట్ రీఫండ్ చేయడం సంతోషకరమన్నారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య,రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, సూపరింటెండెంట్ రాజశేఖర్, హౌసింగ్ స్పెషలిస్టు డాక్టర్ కామరాజు, మాజీ డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్‌సీ మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు



**నరసన్నపేట, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 16న నరసన్నపేట రానున్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక జమ్మజంక్షన్ నుంచి సత్యవరం జంక్షన్ మీదుగా ఎస్‌డబ్ల్యూపీసీ వరకు మెయిన్ రోడ్డును సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. షాపుల్లో తడిచెత్త, పొడిచెత్త వేరుచేయడంపై డీఆర్‌డీఏ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. సుమారు 400 మంది అధికారులు, సిబ్బంది ఏర్పాట్లలో మునిగారు. పోలీసులు పట్టణంలో అడుగడుగునా గాలింపు చర్యలు చేపడుతున్నారు. అనుమానితులను గుర్తించి వారి వివరాలను ఆరా తీస్తున్నారు. సీఎం రూట్ మ్యాప్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మానా అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పరిశీలించారు. హెలీప్యాడ్, సీఎం సభాస్థలం, ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించే ఇందిరానగర్, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో అధికారులకు పలు సూచనలు చేశారు. పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనుల బాధ్యతను శ్రీకాకుళం కార్పొరేషన్, ఆమదాలవలస మున్సిపాలిటీ సిబ్బందికి అప్పగించారు. పోలీసులు, అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. హెలీప్యాడ్ పరిసర ప్రాంతాల భద్రత, వీఐపీల రాకపోకలు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలు రాకపోకలకు అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, అత్యవసర సమయంలో స్పందన వ్యవస్థ, రూట్ వెంబడి ఉన్న కూడళ్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ప్రత్యామ్నాయ మార్గాలు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని పూర్తి అప్రమత్తంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్, డీపీవో స్వరూపరాణి, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీఎస్పీ డి.లక్ష్మణరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యువల్ రాజు, నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు గణేష్, జంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# అధ్వాన్నంగా రహదారులు.. పట్టించుకోని అధికారులు..

**కర్నూలు, పతాకం న్యూస్:** రుద్రవరం మండలంలోని గ్రామాల రహదారులు గుంతలమయంగా ఉన్నాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు, రైతులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దకంబలూరు, డి.కొట్టాల, శ్రీరంగాపురం, కోడకోంట, కె.కొతూరు, బీరవోలు, కెకొత్తూరు-యల్లావత్తుల, బినాగిరెడ్డిపల్లె-పేరూరు, తువ్వపల్లె-రుద్రవరం, లింగందిన్నె-అహోబిళం రోడ్డు, రుద్రవరం-అహోబిళం రోడ్డు, చిన్నకంబలూరు-అప్పనపల్లె, తిమ్మనపల్లె-నరసాపురం, ఆలమూరు-తిమ్మననల్లె ,ముత్తలూరు-నల్లవాగుపల్లె, నాగులవరం-కొత్తపల్లె నాగులవరం-టి.లింగందిన్నె గ్రామాల రహదారులు సరిగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కోటకొండ, శ్రీరంగాపురం గ్రామాల మధ్య కాల్వలపై కల్వర్టులు నిర్మించలేదు కె.కొత్తూరు, బీరవోలు గ్రామాల మధ్య ఉన్న వాగులపై ఉన్న కల్వర్టు కూలిపోయింది. తువ్వల్లె, రుద్రవరం గ్రామాల మధ్య నేలవంతెన ఉంది. అక్కడ కూడా కల్వర్టు నిర్మించలేదు. చాగలమర్రి మండల కేంద్రంలోని 40వ జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డు అధ్వానంగా మారింది. మల్లెవేముల ఫ్లైవోవర్ నుంచి కూలూరు రహదారి వరకు సర్వీసు రహదారి ముళ్లకంప, గుంతలతో నిండుకోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రిళ్లు ఆదమరిస్తే ప్రమాదాలకు గురి కావాల్సిందే. హైవే, టోల్ అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేసి ముళ్ల కంప తొలగించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



## వరి మద్దతు ధర పెంపు



**టెక్కలి, పతాకం న్యూస్:** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించే వరి పంటకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను ప్రకటించింది. క్వింటా వరి గ్రేడ్-1 రకం రూ.2,461, కామన్ రకం రూ.2,441గా నిర్ణయించింది. గత ఏడాది గ్రేడ్-1 రకం రూ.2,389, కామన్ రకం రూ.2,369 ఉండేది. ఈ ఖరీఫ్‌లో క్వింటాకు రూ.72 మద్దతు ధరను పెంచడంతో రూ.2,461 అయింది. దీని ప్రకారం 80కేజీల ధాన్యం బస్తా రూ.1,952 పలకనుంది. ఈ మేరకు కేంద్ర కేబినేట్ ఆమోదం తెలిపింది. జిల్లాలో వరి పండించే ప్రాంతం లక్షా54వేల230 హెక్టార్లగా వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. సరాసరి ఎకరాకు 20బస్తాల ధాన్యం దిగుబడి ప్రాప్తికి, 8.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించే అవకాశాలు ఉన్నాయి. రైతు అవసరాలకు పోగా మిగిలిన ధాన్యానికి రూ.63.36కోట్ల ఆదాయం రైతాంగానికి సమకూరనుంది. అయితే ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు, ఇతరత్రా సమస్యలు తోడైతే దిగుబడులు తగ్గే అవకాశాలు ఉన్నాయి. మరోపక్క పెరిగిన వ్యయం, ఎరువులు, పురుగుమందుల ధరలతో పోల్చిచూస్తే కేంద్రం పెంచిన కనీస మద్దతు ధర కంటితుడుపే అని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. వరికి కనీస మద్దతు ధర పెంచడంలో కేంద్ర ప్రభుత్వం మొసలికన్నీరు కారుస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.

## ‘లార్వా వేట’తో సీజనల్ వ్యాధులు దూరం



**జియ్యమ్మవలస, పతాకం న్యూస్:** సీజనల్ వ్యాధుల నిర్మూలనకు జిల్లా వ్యాప్తంగా ‘లార్వా వేట’ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. టీకే జమ్ము పంచాయతీ గోర్లి గ్రామంలో పర్యటించారు. ‘ గతంలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మలేరియా బాధితులు ఎక్కువగా ఉండేవారు.. ఇప్పుడు అటువంటి వారి సంఖ్య బాగా తగ్గింది. దానికి కారణం గత ఆరు నెలలుగా ‘మా ఊరికి మలేరియా వచ్చింది.. ఫ్రైడే డ్రైడే’ వంటి కార్యక్రమాలు నిర్వహించడమే.. ప్రస్తుతం అక్కడక్కడా నమోదవుతున్న కేసుల నియంత్రణకు ‘లార్వా వేట ’ ప్రారంభించాం. నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వాను గుర్తించి.. నిర్మూలించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. దీనివల్ల సీజనల్ వ్యాధులను దూరం చేయొచ్చు. ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించడానికి ఇప్పటికే ఎంపీడీవోలకు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చాం. వారు గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ’ అని కలెక్టర్ తెలిపారు. అనంతరం గ్రామంలో ఆయన ‘వాగు పండుగ’ అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న వాగులను గుర్తించి, వాటిల్లో లార్వా నివారణకు ఆయిల్ బాల్స్ వేయాలని వైద్య ఆరోగ్యశాఖను ఆదేశించారు. అనంతరం ఆయన బీజే పురం గ్రామం చేరుకున్నారు. బాల్య వివాహాలు అరికట్టాలని సూచించారు. కనీసం డిగ్రీ పాసై, ఉద్యోగం వచ్చిన తరువాతే వివాహం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు, ఎన్‌సీడీ అధికారి టి.జగన్మోహనరావు, డీఐవో వై.విజయ్‌మోహన్, డీపీవో రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మురికి కూపంగా జలదుర్గం గ్రామం



**కర్నూలు, పతాకం న్యూస్:** ప్యాపిలి మండలంలోని జలదుర్గం గ్రామం మురికి కూపంగా మారింది. రహదారి పక్కన, కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో దాదాపు 1,500 కుటుంబాలుండగా, 8 వేలకు పైగా జనాభా ఉంది. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వ్యవహారం రెండు వర్గాల మధ్య వివాదంగా మారింది. దర్గా దారికి విగ్రహం అడ్డంగా ఉందని పక్కకు తొలగించాలని ఓ వర్గం, విగ్రహం ఉన్న ప్రాంతంలోనే ఉంచాలని మరో వర్గం పట్టుపట్టడంతో వివాదంగా మారింది. అధికారులు పలుమార్లు ఇరువర్గాలతో మాట్లాడినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఓ వర్గానికి చెందిన కార్మికులు విధులను బహిష్కరించారు. 15 రోజులుగా పారిశుధ్య పనులు చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరిచాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆంధ్ర పేపర్ మిల్లు కార్మికుల పోరాటానికి ఏపీఆర్‌పీఏ మద్దతు

**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** కడియం పేపర్ మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసన కార్యక్రమానికి ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఏపీఆర్‌పీఏ) పూర్తి మద్దతు ప్రకటించింది. కార్మికులకు జీతాలు పెంచాలని, అక్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తివేయాలని, సస్పెన్షన్లు రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏపీఆర్‌పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సత్తిరాజు మాట్లాడుతూ .. ఆంధ్ర పేపర్ లిమిటెడ్ కడియం యూనిట్‌లో కార్మికులు గత 18 రోజులుగా వేతన ఒప్పందం, జీతాల పెంపు కోసం ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం నిరంకుశ వైఖరితో వ్యవహరిస్తోందని విమర్శించారు. అక్రమ లాకౌట్ విధించి కార్మికులను బయటకు పంపడం అన్యాయమన్నారు. సీఐటీయూ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బి.వి.ఎన్. పూర్ణిమరాజు మాట్లాడుతూ.. వేతన ఒప్పందం గడువు ముగిసి మూడు సంవత్సరాలు దాటినా ఇప్పటికీ యాజమాన్యం చర్చలు పూర్తి చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. గత ఏడాది కాలంగా కాంట్రాక్ట్ కార్మికులతో అనేక దఫాలు చర్చలు జరిగినా ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదని తెలిపారు.

## మహానాడును ఘనంగా నిర్వహించాలి



**కర్నూలు, పతాకం న్యూస్:** టిడిపి మహానాడును అట్టహాసంగా నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతోపాటు మంత్రులు, పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు నిర్ణయించారు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రేగడ చిలక కిసాన్ సెజ్‌లో తొలిసారి మహానాడు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన సమావేశం సాయంత్రం వరకు కొనసాగింది. మహానాడు కన్వీనర్లు, కో-కన్వీనర్లు, సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశ మందిరంలో మహానాడు కోసం ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్లు, మహానాడు ఎలా నిర్వహించాలి, భోజనం, ప్రచారం, మహానాడు వేదిక నిర్వాహణ, తీర్మానాల కమిటీ, ప్రతినిధుల నమోదు కమిటీ, మీడియా, బహిరంగ సభ ఏర్పాట్లు, జన సమీకరణ, వసతి, వంటి కీలక విషయాలపై సమావేశంలో చర్చించారు. 27, 28న సుమారు 20 వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారని, 29న జరిగే బహిరంగ సభకు సుమారు ఏడు లక్షల మంది హాజరు అవుతారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు ఎన్ఎండి ఫరూక్, మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, బిసి జనార్ధన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, రాంప్రసాద్ రెడ్డి, అనిత, నిమ్మల రామానాయుడు , రాంప్రసాద్, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**విజయనగరం, పతాకం న్యూస్:** పేదలకు అండగా టిడిపి ప్రభుత్వం ఉంటుందని విజయనగరం నియోజకవర్గ శాసనసభ్యులు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. గురువారం ఆమె విజయనగరం నియోజకవర్గానికి చెందిన 7 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.3,92,775,/- ల విలువల గల చెక్కులను టిడిపి క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు అందజేశారు. లబ్ధిదారులు : 1) బెల్లాన ఐశ్వర్య -- రూ. 51,734/- 2) కలిశెట్టి నారాయణరావు -- రూ. 73,019/- 3) వానపల్లి గౌతమ్ -రూ. 18,000/- 4) పతివాడ సాయి -- రూ. 53,795/-, 5) సిడగం వరాలు -రూ. 60,577/-, 6) తాలాడ రిషి రిత్విక్ సాయి - రూ. 33,800/-లు, 7) గేదెల శంకరరావు - రూ. 1,01,850/- లు.

## రొయ్య మేత ధరల పెంపుపై వెనక్కి తగ్గిన కంపెనీలు



**కర్నూలు, పతాకం న్యూస్:** రొయ్యల దాణా ధరల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు కంపెనీలు ప్రకటించాయి. ఈమేరకు మంత్రి అచ్చెన్నాయుడు కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. దాణా ధరలను అమాంతం పెంచుతూ కంపెనీలు నిర్ణయించడంతో రైతులు గగ్గోలు పెట్టారు. ఈ నేపథ్యంలో మంత్రి అచ్చెన్నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దాణా తయారీ సంస్థలు, రైతు ప్రతినిధులు, అధికారులతో మాట్లాడారు. అనంతరం స్పందించిన రొయ్యల దాణా తయారీ కంపెనీల ప్రతినిధులు... పెంచిన దాణా ధరలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా తెలియజేశారు. రైతులు, దాణా తయారీ కంపెనీలు, అధికారులతో 15న ఉమ్మడి సమావేశం నిర్వహించనున్నట్లు అచ్చెన్న తెలిపారు. మరోవైపు సీఎం చంద్రబాబు ఇదే విషయంపై కేంద్రం జోక్యాన్ని కోరుతూ బుధవారం మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. 'ఆక్వా రైతులపై రొయ్యల దాణా ధరల భారాన్ని తగ్గించాలి. దాణా తయారీకి వినియోగించే ముడి పదార్థాల ధరల నియంత్రణకు చొరవ తీసుకోవాలి. ధరల పర్యవేక్షణకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి' అని చంద్రబాబు తన లేఖలో కోరారు.

## 20న దేశవ్యాప్త కెమిస్టుల బంద్




**హిందూపురం, పతాకం న్యూస్:** అక్రమ ఈ-ఫార్మసీల నియంత్రణ కోరుతూ మే 20న దేశవ్యాప్త బంద్‌కు అఖిల భారత కెమిస్టులు, డ్రగ్గిస్టుల సంఘం (ఎఐఒసిడి) పిలుపునిచ్చింది. హిందూపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ఫార్మసీలు భౌతిక ధృవీకరణ లేకుండా మందులు విక్రయించడం వల్ల ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోందని, ముఖ్యంగా యాంటీ బయాటిక్స్ దుర్వినియోగం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థల భారీ డిస్కౌంట్ల వల్ల దేశవ్యాప్తంగా ఉన్న 12.40 లక్షల మంది చిన్న కెమిస్టుల జీవనాధారం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ-ఫార్మసీలను ప్రోత్సహించే జి .ఎస్ .ఆర్ . 817(ఈ) ప్రభుత్వ నోటిఫికేషన్లను తక్షణమే రద్దు చేయాలని, మే 20లోపు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమ్మెకు సంబంధించిన గోడపత్రికలను నాయకులు విడుదల చేశారు.

# 'మైగ్రెయిన్' మిమ్ములను వేధిస్తోందా?

నిద్ర చాలనప్పుడు, పని ఒత్తిడి ఎక్కువైనప్పుడు తలనొప్పిగా అనిపించడం మామూలే. ఇలాంటప్పుడు ఒక కప్పు టీ లేదా కాఫీ తాగితే వెంటనే తలనొప్పి తగ్గిపోతుంది. కానీ, మైగ్రెయిన్ అనే తలనొప్పి మాత్రం తలలో నరాలు చిట్లిపోతున్నాయా? ఎవరైనా సుత్తులతో బాదుతున్నారా? అన్నంతగా వేధిస్తుంది. సాధారణంగా ఈ మైగ్రెయిన్ అనేది ఎక్కువ మహిళల్లో కనిపిస్తుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మైగ్రెయిన్ ఉన్నవారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం!

మైగ్రెయిన్ తలలో ఒకవైపు మాత్రమే వేధించే ఒక రకమైన తలనొప్పి. ఇది మొదలైనప్పుడు తలలో నరాలు చిట్టిపోతున్నంతగా నొప్పి వేధిస్తుంటుంది. దీని లక్షణాలు సాధారణంగా ఉదయం నిద్ర నుంచి మేల్కొన్నప్పుడు వస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇది తేలికపాటి తలనొప్పితో ప్రారంభమై, తీవ్రమైన తలనొప్పిగా వస్తుందంటున్నారు. ఇది తరచూ వికారం, వాంతులు లాంటి లక్షణాలు ఉంటాయని, అధిక వెలుతురు, శబ్దాలను భరించలేరని అధ్యయనం పేర్కొంది. ముఖంలో ఒక భాగంలో కానీ, కాళ్లు, చేతుల్లో తిమ్మిరిగా లేదా సూదులతో గుచ్చినట్లుగా అనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా, కళ్లు తిరిగినట్లు, బలహీనత, మాట్లాడటానికి కాస్త ఇబ్బంది పడుతుంటారని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో మహిళల్లో నెలసరికి ముందు, నెలసరి రోజుల్లో మైగ్రెయిన్ బాధలు అధికంగా ఉంటాయంటున్నారు.

ఒత్తిడి, ఆహారం, నిద్రలేమి, జన్యుపరమైన కారణాలు వల్ల మైగ్రెయిన్ వస్తుంది. ఇది ఎక్కువగా 18 నుంచి 40 ఏళ్లు వారికి



అధికంగా వస్తుంటుంది. పురుషులతో పోలిస్తే మహిళలకు ఈ మైగ్రెయిన్ వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉంటుంది. హార్మోన్లలో హెచ్చు తగ్గులు మైగ్రేన్‌కు దారితీయవచ్చు. మైగ్రెయిన్ అనేది పేషేంట్ తలనొప్పి లక్షణాలు బట్టే డయాగ్నోసిస్ అనేది తెలిసిపోతుంది. మైగ్రెయిన్ వాళ్లకి సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ అనేది నార్మల్‌గా ఉంటాయి. వాళ్లకి ఈ టెస్ట్‌లు చేయించినప్పుడు మేజర్ చేంజెస్ ఉండవు. కొంతమందికి ఎంఆర్ఐలో చిన్న చిన్న రక్తనాళాల్లో కొన్ని రకాల మార్పులు కనిపిస్తాయి. మైగ్రెయిన్ వచ్చే విధానాన్ని బట్టి చికిత్స ఉంటుంది.

మైగ్రెయిన్‌కు కొన్ని ప్రత్యేకమైన కారణాలు ప్రేరేపకాలుగా పనిచేస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. మానసిక ఒత్తిడి, అధిక శ్రమ, ప్రకాశవంతమైన వెలుతురు, నెలసరిలో తేడాలు, గర్భ నిరోధక మాత్రలు, మత్తుపానీయాలు, ధూమపానం అలవాట్లు ఇవన్నీ మైగ్రెయిన్‌ను ప్రేరేపిస్తాయంటున్నారు. మైగ్రెయిన్‌లో తలకు ఒకవైపు వెళ్లే నరాలు అకస్మాత్తుగా సంకోచ, వ్యాకోచాలకు లోను కావడంతో తలలో నొప్పి మొదలవుతుందని వివరిస్తున్నారు.

మైగ్రెయిన్‌లో కామన్, క్లాసికల్ అనే రెండు రకాల తలనొప్పులు కనిపిస్తాయని నిపుణలు చెబుతున్నారు. కామన్ మైగ్రెయిన్ అనేది తలలో రెండు వైపులా నొప్పి బాధిస్తుందని, ఇది ఎక్కువగా మహిళల్లో ఎక్కువగా వస్తుంటుందని తెలియజేస్తున్నారు. అంతే కాకుండా, కళ్లలో సూదులతో గుచ్చుతున్నట్లుగా నొప్పి ఉంటుందని, ఎక్కువగా కంటి వెనుక భాగంలో ఈ నొప్పి ఉంటుందని వివరిస్తున్నారు. క్లాసికల్ మైగ్రెయిన్?లో తలనొప్పి ఒక పక్క చెవిపైన మొదలై మొత్తం సగభాగానికి పాకుతుందంటున్నారు. ఒకసారి కుడివైపు కలిగితే, మరొకసారి ఎడమవైపు రావొచ్చని చెబుతున్నారు. మన జనాభాలో సుమారు 10 శాతం మంది మైగ్రెయిన్ బాధితులు ఉన్నారని పలు అధ్యయనాల్లో వెల్లడైంది.

మైగ్రెయిన్‌కి రెండు రకాలుగా చికిత్స ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మొదటి రకం చికిత్సలో తక్షణం నొప్పిని నివారించే మందులను ఇస్తుంటారని తెలియజేస్తున్నారు. రెండో రకం చికిత్సలో, మైగ్రెయిన్ మళ్లీ మళ్లీ రాకుండా ఉండేందుకు దీర్ఘకాలికంగా పనిచేసే మందులను సూచిస్తుంటారు.

మైగ్రెయిన్ నివారించుకోవడానికి జీవన శైలిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, తగినంత నిద్రపోవడం, ప్రతి రోజు ఒకే సమయానికి పడుకోవడం, బరువు నియంత్రణలో ఉండాలని అధ్యయనం పేర్కొంది. ఈ క్రమంలో నిత్యం ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళనలు తట్టుకునేందుకు యోగ, ధ్యానం ప్రాణాయామాలని ఆచరించాలని నిపుణులు సూచిస్తున్నారు. ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లుకు దూరంగా ఉండాలని సలహా ఇస్తున్నారు.

తక్కువ మొత్తంలో, కెఫిన్ మాత్రమే ప్రారంభ దశలో మైగ్రెయిన్ నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తుంది, తల లేదా మెడకు వేడి లేదా చల్లని కంప్రెస్‌లను వాడండి. చీకటిగా, నిశ్శబ్దంగా ఉన్న గదిలో విశ్రాంతి తీసుకోండి.

## ఇరాన్‌పై మళ్లీ సైనిక చర్య.. ఈసారి 'ఆపరేషన్ స్లెడ్జ్‌హ్యామర్' పేరుతో యుద్ధం!



**న్యూయార్క్:** ఇరాన్‌తో సైనిక ఘర్షణలు మళ్లీ మొదలైతే, చేపట్టబోయే సైనిక చర్యకు కొత్త పేరు పెట్టాలని అమెరికా భావిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' స్థానంలో 'ఆపరేషన్ స్లెడ్జ్‌హ్యామర్' అనే పేరును పెంటగాన్ పరిశీలిస్తున్నట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. కాల్పుల విరమణ ఒప్పందం విఫలమై, దాడులు పునఃప్రారంభమైతే ఈ కొత్త పేరుతో ఆపరేషన్ నిర్వహించాలని యోచిస్తున్నారు. ఈ పేరు మార్పు వెనుక ఓ కీలకమైన చట్టపరమైన వ్యూహం ఉన్నట్లు స్పష్టమవుతోంది. 1973 నాటి వార్ పవర్స్ రిజల్యూషన్ ప్రకారం అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు 60 రోజులకు మించి సైనిక చర్యను కొనసాగించలేరు. ఆపరేషన్ పేరు మార్చడం ద్వారా, పాత ఆపరేషన్ ముగిసిందని, కొత్తది ప్రారంభమైందని వాదించి, ఆ 60 రోజుల గడువును మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాలని ట్రంప్ సర్కార్ యోచిస్తోంది. ఈ విధంగా కాంగ్రెస్ అనుమతి లేకుండానే మరికొంత కాలం సైనిక చర్యలు కొనసాగించేందుకు అవకాశం లభిస్తుంది.

మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా గడ్డపై కాలుమోపారు. ఆయన బీజింగ్ చేరుకున్నారు. దాదాపు ఒక దశాబ్దం తర్వాత అమెరికా అధ్యక్షుడు చైనాలో పర్యటించడం ఇదే ప్రథమం. బీజింగ్ క్యాపిటల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ట్రంప్‌కు చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్ సైనిక గౌరవ వందనంతో ఘనస్వాగతం పలికారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ట్రంప్, చైనా అధ్యక్షుడు షి జిన్ పింగ్‌తో ఉన్నతస్థాయి సమావేశంలో పాల్గొంటారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం, వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు, టెక్నాలజీ పోటీ నెలకొన్న తరుణంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ చర్చల్లో ప్రధానంగా వాణిజ్యం, ఇరాన్ యుద్ధం, తైవాన్‌కు అమెరికా ఆయుధాల విక్రయం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), చిప్స్ వంటి సాంకేతిక అంశాలపై దృష్టి సారించనున్నారు. ఇరు దేశాల మధ్య ప్రస్తుతం ఉన్న తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని స్థిరీకరించుకోవాలని రెండు దేశాలూ భావిస్తున్నాయి.

# 'మొంథా' తుపాను పనులకు నిధుల కొరత

## శాశ్వత పనులకు రూ.12.49 కోట్లతో ప్రతిపాదనలు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** గత ఏడాది అక్టోబరులో సంభవించిన మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న సాగునీటి వనరులు, నదుల గట్లు, ఆనకట్టలు వంటివి ఇంతవరకు మరమ్మతులకు నోచుకోలేదు. అప్పట్లో చేపట్టిన తాత్కాలిక పనులు తప్ప, ఇంతవరకు శాశ్వత పనులు చేయలేదు. వీటి మరమ్మతులు, పునరుద్ధరణ పనుల కోసం సుమారు పన్నెండున్నర కోట్ల రూపాయలు అవసరమని జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. మరో నెల రోజుల్లో వర్షాకాలం మొదలవుతుందని, ఈలోగా పనులు చేయకపోతే ఇబ్బందులు తప్పవని రైతులు అంటున్నారు. గత ఏడాది అక్టోబరు చివరి వారంలో సంభవించిన మొంథా తుఫాన్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపింది. పలు మండలాల్లో పంట కాలువల గట్లు దెబ్బతిన్నాయి. రైవాడ, పెద్దేరు, కోనాం జలాశయాల నుంచి పెద్ద మొత్తంలో వరద నీటిని విడుదల చేయడంతోపాటు పలు గెడ్డల నుంచి వరద నీరు చేరికతో శారదా నది ఉగ్రరూపం దాల్చింది. కొన్నిచోట్ల నది గట్లు కోతకు గురయ్యాయి. రాంబిల్లి మండలం వైలోవ వద్ద ఎడమ గట్టుకు సుమారు 100 మీటర్ల పొడవున భారీ గండి పడింది. దీంతో వైలోవ, మర్రిపాలెం, రజాల, కేజీపాలెం గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ వచ్చి పరిశీలించారు. గట్టుకు పడిన గండిని ఇసుక బస్తాలతో తాత్కాలికంగా పూడ్చివేశారు. ఇక నారాయణపురం వద్ద మైనర్ శారదా నది గట్టు తెగడంతో పంట పొలాలు నీటమునిగాయి. మాకవరపాలెం మండలం జి.కోడూరులో గెడ్డకు గండిపడి సుమారు 300 ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. 20 ఎకరాలకుపైగా ఇసుక, మట్టి మేటలు వేసింది. మొంథా తుఫాన్ ప్రభావంతో సాగునీటి వనరులకు మరమ్మతులు చేపట్టేందుకు 415 పనులను అధికారులు గుర్తించారు. వీటిలో తాత్కాలిక మరమ్మతులకు రూ.1.83 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.10.66 కోట్లు.. మొత్తం రూ.12.49 కోట్లు అవసరమని అంచనాలు రూపొందించి గత ఏడాది డిసెంబరులో ప్రభుత్వానికి పంపారు. ఇది జరిగి సుమారు ఐదు నెలలు కావస్తున్నది. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదు. సాగునీటి వనరులకు మరమ్మతులు, నిర్వహణ పనులను సాధారణంగా వేసవిలో చేస్తుంటారు. జూన్/జూలైలో ఖరీఫ్ మొదలయ్యేనాటికి పూర్తయ్యేలా జనవరి నుంచే పనులు మొదలుపెడతారు. మరి కొద్ది రోజుల్లో వేసవి ముగుస్తుంది. కానీ గత ఏడాది తుఫాన్ వల్ల దెబ్బతిన్న సాగునీటి వనరులకు మరమ్మతు పనులు ఇంతవరకు ప్రారంభం కాలేదు. పనులు త్వరగా చేయకపోతే వర్షాకాలంలో గట్లు కోతకు గురై గండ్లు పడే ప్రమాదం వుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు స్పందించి, మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్న సాగునీటి వనరుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలని వారు కోరుతున్నారు. కాగా మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్న సాగునీటి వనరుల మరమ్మతులపై జలవనరుల శాఖ జిల్లా అధికారి త్రినాథంను వివరణ కోరగా.. కొద్ది రోజుల్లో నిధులు మంజూరయ్యే అవకాశం వుందని, వెంటనే పనులు ప్రారంభించి ఖరీఫ్ వర్షాలు మొదలయ్యేనాటికి పూర్తిచేస్తామని పేర్కొన్నారు.




## విరాట్ కోహ్లీ సెంచరీ..

# రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజయం



ఛేజ్ మాస్టర్ విరాట్ కోహ్లీ (60 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లతో 105 నాటౌట్) శతకంతో విజృంభించడంతో.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) మళ్లీ అగ్రస్థానానికి చేరుకొంది. బెంగళూరు 6 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)ను చిత్తు చేసింది. తొలుత కోల్‌కతా 20 ఓవర్లలో 192/4 స్కోరు చేసింది. అంగ్‌క్రిష్ రఘువంశీ (46 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 71), రింకూ సింగ్ (29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 49 నాటౌట్) రాణించారు. భువనేశ్వర్, హాజెల్‌వుడ్, రసిక్ సలామ్ తలో వికెట్ పడగొట్టారు. ఛేదనలో బెంగళూరు 19.1 ఓవర్లలో 194/4 స్కోరు చేసి గెలిచింది. దేవ్‌దత్ పడిక్కల్ (39) ఫర్వాలేదనిపించాడు. కార్తీక్ త్యాగి మూడు వికెట్లు దక్కించుకొన్నాడు. కాగా, వర్షం కారణంగా 75 నిమిషాలపాటు ఆట ఆలస్యంగా ఆరంభమైంది. కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. రెండు మ్యాచ్‌ల్లో వరుసగా డకౌట్ అయిన విరాట్.. అద్భుత ప్రదర్శనతో జట్టును అలవోకగా గెలిపించాడు. ఛేదనను బెంగళూరు ఓపెనర్లు జాకబ్ బెథల్ (15), కోహ్లీ ధాటిగా ఆరంభించారు. రెండో ఓవర్‌లో వైభవ్ బౌలింగ్‌లో కోహ్లీ నాలుగు బౌండ్రీలతో 18 పరుగులు రాబట్టగా.. ఆ తర్వాతి ఓవర్‌లో బెథల్ 6,4,4తో దూకుడు కనబర్చాడు. అయితే, బెథల్‌ను కార్తీక్ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేసినా.. వన్‌డౌన్‌లో వచ్చిన పడిక్కల్ నాలుగు ఫోర్లతో జోరు చూపాడు. ఆరో ఓవర్‌లో కోహ్లీ సిక్స్ బాదడంతో.. బెంగళూరు 66/1తో పవర్‌ప్లేను ముగించింది. అయితే, గ్రీన్ బౌలింగ్‌లో పడిక్కల్ ఇచ్చిన క్యాచ్‌ను వైభవ్ చేజార్చాడు. మరోవైపు 10వ ఓవర్‌లో కోహ్లీ డబుల్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. టీమ్ స్కోరు సెంచరీ మార్క్ దాటింది. అయితే, 14వ ఓవర్‌లో పడిక్కల్‌ను కార్తీక్ క్యాచవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 92 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ పటీదార్(11)తో మూడో వికెట్‌కు 28 పరుగులు జోడించిన కోహ్లీ.. జట్టును గెలిపించే బాధ్యత తీసుకొన్నాడు. చివరి 5 ఓవర్లలో 48 పరుగులు కావాల్సి ఉండగా.. నరైన్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన పటీదార్ ఆ తర్వాతి బంతికి పెవిలియన్ చేరాడు. కానీ, రాయ్ వేసిన 17వ ఓవర్‌లో కోహ్లీ 15 పరుగులు రాబట్టాడు. టిమ్ డేవిడ్ (2)ను కార్తీక్ క్యాచవుట్ చేసే సమయానికి ఆర్సీబీ విజయానికి 13 పరుగుల దూరంలో ఉంది. 19వ ఓవర్‌లో సింగిల్‌తో సెంచరీ సాధించిన కోహ్లీ.. మరో ఫోర్ కొట్టాడు. చివరి ఓవర్‌లో 3 పరుగులు అవసరం కాగా.. బౌండ్రీ బాదిన జితేశ్ శర్మ (8 నాటౌట్) మరో 5 బంతులు మిగిలుండగానే జట్టును విజయతీరాలకు చేర్చాడు. రఘువంశీ బాధ్యతాయుత అర్ధ శతకంతో ఆదుకోవడంతో.. కోల్‌కతా సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా.. పవర్‌ప్లేలోనే ఓపెనర్లు ఆలెన్ (18), రహానె (19) వికెట్లను చేజార్చుకొంది. మూడు ఫోర్లు, సిక్స్ బాదిన ఆలెన్‌ను భువీ వెనక్కిపంపగా.. ఐదో ఓవర్‌లో రహానెను హాజెల్‌వుడ్ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేశాడు. అయితే, వన్‌డౌన్ బ్యాటర్ రఘువంశీ.. గ్రీన్‌తో కలసి మూడో వికెట్‌కు 68 పరుగులతో ఆదుకొనే ప్రయత్నం చేశాడు. గ్రీన్‌ను 13వ ఓవర్లో రసిక్ అవుట్ చేసినా.. అనంతరం క్రీజులోకి వచ్చిన రింకూతో కలసి రఘువంశీ స్కోరు బోర్డును నడిపించాడు. నాలుగో వికెట్ వీరిద్దరి 76 పరుగుల భాగస్వామ్యంతో.. కోల్‌కతా స్కోరు 190 మార్క్ దాటింది. ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న రఘువంశీ ఆఖరి బంతికి రనౌటయ్యాడు.

## వీరేంద్ర సెహ్వాగ్‌పై మండిపడుతున్న బుమ్రా ఫ్యాన్స్



భారత క్రికెట్ జట్టు దిగ్గజ బ్యాటర్ వీరేంద్ర సెహ్వాగ్‌పై స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుమ్రా అంటే ఎందుకు అంత చులకనంటూ సోషల్ మీడియా వేదికగా మండిపడుతున్నారు. అసలు బుమ్రా అభిమానులు సెహ్వాగ్‌పై ఫైర్ కావడానికి కారణం ఏమిటి, ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం... ఐపీఎల్ 2026లో భాగంగా ఇవాళ ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ ముందు వీరేంద్ర సెహ్వాగ్ ఓ స్పోర్ట్స్ ఛానల్ నిర్వహించిన చర్చలో పాల్గొన్నాడు. సెహ్వాగ్ మాట్లాడుతూ... ముంబై జట్టులో తోపు ఆటగాళ్లు ఉన్నప్పటికీ, ఓడిపోతున్నారని అన్నాడు. హార్దిక్ పాండ్యా, దీపక్ చాహర్ లాంటి తోపు బౌలర్లు ఉన్నప్పటికీ విరాళంగా పరుగులు ఇస్తున్నారని మండిపడ్డాడు. ఈ క్రమంలోనే పొరపాటున బుమ్రాను 'చుమ్రా' అని సంబోధించాడు. సెహ్వాగ్ వెంటనే తన తప్పును సరిదిద్దుకుని.. తిరిగి బుమ్రా అని అన్నాడు. కానీ ఆ పొరపాటుకు సంబంధించిన వీడియో మాత్రం సోషల్ మీడియాలో తెగ వైరలు అయింది. దీంతో బుమ్రా అభిమానులు వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. 'సెహ్వాగ్‌కు బుమ్రా అంటే ఎందుకంత ద్వేషం?' అని ఓ యూజర్ ఎక్స్ వేదికగా తన అసహనాన్ని వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండగా విడుదలైన తాజా ఐసీసీ ర్యాంకింగ్‌లలో టెస్ట్ బౌలర్లలో బుమ్రా(879 పాయింట్లు) తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. మహమ్మద్ సిరాజ్ 12వ స్థానంలో ఉన్నాడు. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లు వరుసగా 14,15వ స్థానాల్లో ఉన్నారు. బ్యాటర్లలో యశస్వి జైస్వాల్ , శుభ్‌మన్ గిల్ వరుసగా 8వ, 9వ స్థానాల్లో కొనసాగుతున్నారు. ఇంగ్లండ్ మాజీ టెస్ట్ కెప్టెన్ జో రూట్ 880 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో హ్యారీ బ్రూక్ రెండవ స్థానంలో ఉండగా, అతని తర్వాత వరుసగా ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్ ఉన్నారు .




# బాలయ్య సినిమాలో కీలకపాత్రలో హనీరోజ్!



నందమూరి బాలకృష్ణ, గోపిచంద్ మలినేని కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న హిస్టారికల్ యాక్షన్ డ్రామా చిత్రంలో మలయాళ నటి హనీరోజ్ కీలక పాత్రలో నటిస్తున్నట్టు తెలుస్తోంది. మూడేళ్ళ క్రితం బాలకృష్ణ, హనీరోజ్ కాంబినేషన్‌లో 'వీరసింహారెడ్డి' వచ్చింది. తాజాగా, గోపీచంద్ మలినేని దర్శకత్వంలో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో, హానీరోజ్ కూడా నటిస్తుందన్న వార్తలతో అంచనాలు రెట్టింపయ్యాయి.

బాలకృష్ణ, గోపిచంద్ కలయికలో వచ్చిన వీరసింహారెడ్డి మంచి విజయాన్ని దక్కించుకుంది. దీంతో ఈ కొత్త ప్రాజెక్టుపై అంచనాలు భారీగా ఉన్నాయి. బాలకృష్ణ, గోపిచంద్ మలినేని, హనీరోజ్ కాంబినేషన్‌లో వచ్చిన 'వీరసింహారెడ్డి'ని ప్రేక్షకులు ఆదరించారు. ఇదే హిట్ కాంబినేషన్‌లో సినిమా తెరకెక్కుతుండటం నందమూరి అభిమానుల ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది.

సంక్రాంతి విజయాలకు బాలకృష్ణ పెట్టింది పేరు. 2023లో వచ్చిన వీరసింహారెడ్డిలో బాలకృష్ణ, హనీరోజ్ కెమిస్ట్రీ నందమూరి అభిమానులను అలరించింది. ఈ చిత్రంలో బాలకృష్ణ భార్యగా 'మీనాక్షి' పాత్రలో హానీరోజు ఒదిగిపోయింది. ముఖ్యంగా 'సుగుణ సుందరి' పాటలో వీరి డ్యాన్స్ మూమెంట్స్ అదరగొట్టింది. ఈ చిత్రం తర్వాత హనీరోజ్ తెలుగులో చెప్పుకోదగిన సినిమాల్లో నటించలేదు. ఇప్పుడు బాలకృష్ణ సరసన మరోసారి కనిపించనుంది.

# జూన్ 19న థియేటర్స్‌లో.. 'మా ఇంటి బంగారం'

స్టార్ హీరోయిన్ సమంత నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. ఈ సినిమా కొత్త విడుదల తేదీని చిత్ర బృందం ప్రకటించింది. ముందుగా ప్రకటించిన ప్రకారం మే 15న కాకుండా, కొత్తగా జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు బుధవారం నాడు గన్‌తో ఉన్న సమంత రగ్డ్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026 సీజన్ కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చిత్ర నిర్మాణ సంస్థ ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రేక్షకులు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మద్దతుదారులు టోర్నమెంట్‌ను పూర్తిగా ఆస్వాదించడానికి అవకాశం కల్పించేందుకే సినిమాను వాయిదా వేస్తున్నట్టు వివరించింది. డిస్ట్రిబ్యూటర్ల అభ్యర్థన మేరకు ఐపీఎల్ వేడిని దృష్టిలో ఉంచుకుని ఈ మార్పు చేసినట్టు పేర్కొంది.

'ఓ బేబీ' తర్వాత నందిని రెడ్డి దర్శకత్వంలో సమంత నటిస్తున్న ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. దీనికి రాజ్ నిడిమోరు క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు. సమంత తన సొంత బ్యానర్ 'ట్రలాలా మూవింగ్ పిక్చర్స్' పై నిర్మాతగా మారి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. సంతోష్ నారాయణన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో సమంత ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాల్లో నటించినట్టు తెలుస్తోంది.



# శర్వానంద్ సరసన ఛాన్స్ కొట్టేసిన మానస వారణాసి!



టాలీవుడ్ స్టార్ శర్వానంద్, వరుస హిట్‌లతో దూసుకుపోతూ తన మార్కెట్‌ను పెంచుకుంటున్నారు. తాజాగా ఆయన సీనియర్ దర్శకుడు శ్రీనువైట్లతో చేతులు కలపడం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. శ్రీనువైట్ల అంటేనే మనకు గుర్తొచ్చేది కడుపుబ్బ నవ్వించే వినోదం. అయితే ఈసారి ఆయన కేవలం కామెడీకే పరిమితం కాకుండా, దానికి 'టైమ్ ట్రావెల్' అనే సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట్‌ను జోడిస్తున్నారు. శర్వానంద్ టైమింగ్‌కు, శ్రీనువైట్ల మార్క్ హ్యూమర్‌కు తోడు సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తోడైతే బాక్సాఫీస్ వద్ద సరికొత్త మేజిక్ జరుగుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జులైలో సెట్స్ పైకి వెళ్లనుంది. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో ఈ సినిమాను నిలపాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే ఉత్కంఠకు తెరపడినట్లు కనిపిస్తోంది. మొదట స్టార్ హీరోయిన్ల పేర్లు వినిపించినప్పటికీ, చివరకు మిస్ ఇండియా రన్నరప్ మానస వారణాసిని ఖరారు చేసినట్లు సమాచారం. 'కవుల్ ఫ్రెండ్లీ' సినిమాతో నటిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న మానసకు, శర్వానంద్ పక్కన ఇది ఒక గోల్డెన్ ఛాన్స్ అని చెప్పాలి. ఈ కొత్త జోడీ వెండితెరపై ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఫీల్‌ను ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**